## విలేకరులు కావలెను

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



## టీవీ రిపోర్టర్లు కావలెను

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | శుక్రవారం 18-07-2025 | సంపుటి : 11 | సంచిక : 168 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత నాది

రాయలసీమ చరిత్రలో ఈ రోజు (జూలై 17) ఒక శుభదినంగా నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నంద్యాల పర్యటన సందర్భంగా తెలిపారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన తాను, రాయలసీమకు నీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేసిన ఈ రోజును ఎప్పటికీ మరచిపోలేనని ఉద్వేగంతో అన్నారు. రాయలసీమ దిశా దశను మార్చేది నీరు అని సీఎం ప్రస్తావించారు. గతంలో రాయలసీమలో నీటి కొరత వల్ల వేరుశనగ పంటలు ఎండిపోయినప్పుడు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకున్నట్లు చంద్రబాబు గుర్తు చేశారు.

### రాయలసీమకు జీవనాడి

పశువులకు గడ్డి లేనప్పుడు, ఇతర ప్రాంతాల నుంచి గడ్డి తెప్పించి ఆకలిని తీర్చామన్నారు. రాయలసీమకు నీళ్లు ఇవ్వాలని మొట్టమొదట ఆలోచించిన నాయకుడు ఎన్టీఆర్ అని, ఆయన ఆలోచనలను సాకారం చేసిన ఏకైక వ్యక్తి కూడా ఎన్టీఆర్ అని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమకు జీవనాడి అయిన హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు శరవేగంగా పూర్తి చేశామన్నారు. మొదటి ఫేజ్ పూర్తి చేసి మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి నీటిని విడుదల చేసిన సీఎం.. హంద్రీనీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 2200 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు పెంచడం వల్ల సీమ రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.



### సీఎం అభినందనలు

రికార్డు స్థాయిలో ఈ పనులు పూర్తి చేయడంలో భాగస్వాములు అయిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో త్వరలోనే ఫేజ్ 2 పనులు పూర్తి చేద్దామని, నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీటిని అందించే ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నీళ్లిస్తే రైతులు బంగారం పండిస్తారని, సంపద సృష్టికి మూలమైన జలాన్ని ప్రతి ఎకరాకు అందించాలనే సంకల్పాన్ని అందరి సహకారంతో నేరవేరుస్తామన్నారు. ఈ క్రమంలో రైతన్నల సాగునీటి కష్టాలు తీర్చి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

### జగన్ ప్రభుత్వంపై..

ఇదే సమయంలో గత జగన్ ప్రభుత్వంపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్, ఐదేళ్లలో రాయలసీమను విధ్వంసం చేశారన్నారు. హంద్రీ-నీవాకు పది పైసలు కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. కులాలు, మతాలను రెచ్చగొట్టి, రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించారని, అలాంటి నాయకులు రాజకీయాలకు అనర్హులని విమర్శించారు. దీంతో ఇకపై రాయలసీమకు నీళ్ల కష్టాలు ఉ ండవన్నారు. ఈ ప్రాంతం రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.

### రాజకీయ విమర్శలు

గత ప్రభుత్వం రోడ్లను గోతుల మయంగా మార్చిందని, మామిడి కాయలను రోడ్డుపై పారబోసి విధ్వంసం సృష్టించిందని చంద్రబాబు విమర్శించారు. రౌడీ మూకలు తోక జాడిస్తే కట్ చేస్తామని హెచ్చరించారు. రాయలసీమలో ముఠా కక్షలు లేకపోతే, ఈ ప్రాంతం దేశంలోనే అత్యుత్తమంగా ఉంటుందని సీఎం అన్నారు. హైదరాబాద్ కంటే మిన్నగా అమరావతిని నిర్మిస్తామని, ప్రధాని నరేంద్ర మోదీ సూచనల మేరకు నదుల అనుసంధానం చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. వేదవతి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని, గోరుకల్లు, అలగనూరు రిజర్వాయర్‌ల మరమ్మతులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

### ఇతర అభివృద్ధి కార్యక్రమాలు

అనంతపురంలో కియా ప్లాంట్: పట్టుదలతో అనంతపురంలో కియా ప్లాంట్‌ను తీసుకొచ్చినట్లు చంద్రబాబు తెలిపారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25లో ఏపీకి ఐదు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు..

కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే 2024-25లో ఇండోర్ వరుసగా 8వ సారి అత్యంత పరిశుభ్రమైన నగరంగా నిలిచింది. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఐదు అవార్డులు గెల్చుకుని వావ్ అనిపించింది. స్వచ్ఛ సర్వేక్ష న్-2025 అవార్డుల కార్య్ర కమంలో రాష్ట్రం నుంచి విజయ ువాడ, తిరుపతి, గుంటూ రు, గ్రేటర్ విశాఖపట్నం (జీవీఎంసీ), రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్లు అవార్డులు దక్కించుకున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయ ుణ అవార్డు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్‌తో పాటు రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు, ఆయా కార్పొరేషన్ల అధికారులు పాల్గొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు



అందుకోవడం గర్వకారణమని, ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని మంత్రి నారాయణ హృదయపూర్వకంగా అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛ భారత్ మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో ప్రతి నెల మూడో శనివారం నియోజకవర్గంలో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించేందుకు రాష్ట్రం సన్నద్ధమవుతోందని, స్వచ్ఛతా కార్యక్రమాలకు ప్రజల సహకారం, అధికారుల అంకితభావం కూడా కీలకమని మంత్రి వెల్లడించారు.

# మల్యాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ఘన స్వాగతం

నంద్యాల/నందికొట్కూరు(విజయ సారథి):నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల గ్రామంలో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు జలాలకు జలహారతి, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గురువారం ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్ నుండి అల్లూరు మండలంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి.ఫరూక్, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్ రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్,





నందికొట్కూరు, పాణ్యం, ఆళ్లగడ్డ, గుంతకల్లు శాసనసభ్యులు గిత్త జయసూర్య, గౌరుచరిత భూమా అఖిలప్రియ, గుమ్మనూరు జయరాం, నంద్యాల పార్లమెంటు టిడిపి ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ అరుణజ్యోతి, పార్టీ నాయకులు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం హెలిప్యాడ్ నుండి మల్యాల లో హంద్రీనీవా సుజల స్రవంతి పంపింగ్ స్టేషన్ నుంచి నీటి విడుదల, కృష్ణా జలాలకు జలహారతి కార్యక్రమం, నీటి సంఘాల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. కార్యక్రమాలను ముగించుకొని తిరిగి సాయంత్రం అల్లూరు హెలిప్యాడ్ చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, డిఐజి ప్రవీణ్ కుమార్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి, శాసనసభ్యులు జయసూర్య, బుడ్డా రాజశేఖరరెడ్డి, నంద్యాల పార్లమెంటు టిడిపి ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఆత్మకూరు ఆర్డీఓ అరుణజ్యోతి తదితరులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు మంత్రులు, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం హెలికాప్టర్లో ఓర్వకల్ ఎయిర్పోర్ట్ కు ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్లారు.

# తెలంగాణలో నాలుగు రోజులు భారీ వర్షాలు..

## హెచ్చరించిన ఐఎండీ

హైదరాబాద్, రాగల నాలుగురోజులు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని పేర్కొంది. శుక్రవారం నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. శనివారం వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.



# ఫ్యాక్షన్ బాధిత కుటుంబానికి మంత్రి లోకేష్ అండ






అమరావతి, జులై 17: ఫ్యాక్షన్ బారిన పడి సర్వం కోల్పోయిన కుటుంబానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారు. రాయలసీమలో బోయ నరసింహులు కుటుంబం ఫ్యాక్షన్ భూతానికి బలి అయ్యింది. ప్రత్యర్థుల చేతుల్లో బోయ నరసింహులు సహా ముగ్గురు కిరాతకంగా హత్యకు గురయ్యారు. ఈ క్రమంలో బోయ నరసింహులు కుటుంబాన్ని మంత్రి లోకేష్.. ఉండవల్లి నివాసానికి పిలుపించుకుని మాట్లాడారు. కుటుంబానికి అండగా ఉంటానని, అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కాగా.. రాయలసీమలో ఫ్యాక్షన్ బారిన పడి నష్టపోయిన కుటుంబాలను ఉండవల్లి నివాసానికి పిలుపించుకుని మాట్లాడారు మంత్రి. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గం కామిరెడ్డిపల్లికి చెందిన దాసరి నరసింహులు టీడీపీలో మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దీంతో ప్రత్యర్థులు దారి కాచి 2011లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న బోయ నరసింహులు సహా అతని కుమారుడు, కుమార్తెను దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. ఫ్యాక్షన్ బారిన పడి బోయ నరసింహులు కుటుంబం ఎంతో నష్టపోయింది. అప్పట్లో పార్టీ అధినేత చంద్రబాబు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఇప్పుడు మృతుడి కుటుంబ సభ్యులను మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసానికి ఆహ్వానించారు. హామీ ఇచ్చారు. నాటి ఫ్యాక్షన్ హత్యా ఘటనలో రెండు నిలల చిన్నారి మృత్యుంజయుడిగా బయటపడ్డాడు. సదరు బాలుడిని మంత్రి ఆప్యాయంగా పలకరించారు. బాలుడి చదువు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి వెళ్లాలని, తాను కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఉండవల్లి నివాసానికి పిలుపించుకుని తమ యోగక్షేమాలు వాకబు చేయడం పట్ల మంత్రి నారా లోకేష్‌కు బోయ నరసింహులు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు









కర్నూలు(విజయ సారథి):నంద్యాల జిల్లా పర్యటన ముగించుకొని సాయంత్రం 4.45 గంటలకు కర్నూలు ఎయిర్పోర్ట్ కి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. తిరుగు ప్రయాణంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ తదితరులు ఘన వీడ్కోలు పలికారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు కర్నూలు ఎయిర్పోర్ట్ నుండి గన్నవరం ఎయిర్పోర్ట్ కి బయలుదేరి వెళ్ళారు.

# సంపాదకీయం

శుక్రవారం 18-07-2025

## ప్రతి ఒక్కరిపై 11 లక్షల అప్పు

ప్రపంచంలో ఎంత అప్పు ఉందో తెలుసా..? అది ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ పంచితే దాదాపు రూ.11 లక్షల ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం, ప్రపంచం మొత్తం అప్పు 102 ట్రిలియన్ డాలర్లు అంటే రూ. 8,67,53,95,80,00,00,001. ప్రపంచ జనాభా 8.2 బిలియన్లు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా అత్యధిక రుణాన్ని కలిగి ఉంది. కాగా, చైనా, జపాన్, యూరోపియన్ దేశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ జాబితాలో భారత్ 7వ స్థానంలో ఉంది. దీని మీద 3 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉంది. ఇది మొత్తం ఉఆఖ కంటే తక్కువగా ఉండవచ్చు. కానీ భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌కి ఈ రుణం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రపంచం, దేశాల రుణాలకు సంబంధించి ఈ నివేదికలో ఎలాంటి గణాంకాలు ఉన్నాయో చూద్దాం.భారతదేశం గత దశాబ్దకాలంలో అనేక ఆర్థిక సంస్కరణలు, సామాజిక పథకాలు, రాజకీయ మార్పులను చవిచూసింది. కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశ ఆర్థికవృద్ధి, ఉపాధి కల్పన, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై ఎన్నో వాగ్దానాలు చేసింది. అయితే, ఇటీవలి ఆర్థిక నివేదికలు, సామాజిక వాస్తవాలు సామాన్య పౌరుడి జీవితంలో పెరిగిన అప్పుల భారాన్ని, ఆర్థిక సంక్షోభాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇటీవల విడుదల చేసిన ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్– 2025 ప్రకారం, దేశంలోని ప్రతి పౌరుడిపై సగటున రూ. 4.8 లక్షల అప్పు ఉంది. ఇది గత రెండేళ్లలో రూ. 90,000 మేర పెరిగింది. ఈ గణాంకాలు సామాన్యుడి జీవన పరిస్థితులు ఎంత దిగజారాయో చాటుతున్నాయి.ఆర్‌బిఐ నివేదిక ప్రకారం, 2023 మార్చిలో ఒక్కో పౌరుడిపై అప్పు రూ. 3.9 లక్షలుగా ఉండగా, 2025 మార్చి నాటికి ఇది రూ. 4.8 లక్షలకు చేరింది. ఈ రూ. 90,000 పెరుగుదల సామాన్యుడి ఆర్థిక ఒత్తిడిని సూచిస్తుంది. దేశ జిడిపిలో అప్పుల వాటా 41.9 శాతంగా ఉంది. ఇందులో గృహ రుణాలు 29 శాతం. క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, మొబైల్ ఇఎంఐలు 54.9 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మరో ఆందోళనకర అంశం ఏమిటంటే, లోన్– టు-వాల్యూ (ఎల్‌టివి) రేషియో 70 శాతానికి పైగా ఉండటం. ఇది రుణాల రికవరీని కష్టతరం చేస్తుంది. అంతేకాక, 25 శాతం రిటైల్ రుణాలు సురక్షితం కానివిగా గుర్తించారు. ఇది ఆర్థిక వ్యవస్థలో అస్థిరతను సూచిస్తుంది.ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, దేశంలో సగటు తలసరి ఆదాయం రూ. 2.16 లక్షలు మాత్రమే. అంటే, సామాన్యుడి అప్పు అతని ఆదాయం కంటే రెండింతలకు పైగా ఉంది. ఈ అసమతుల్యత సామాన్య పౌరుడు తన రోజువారీ జీవన అవసరాల కోసం అప్పులపై ఆధారపడుతున్నాడని స్పష్టం చేస్తుంది. ఆర్‌బిఐ గణాంకాలు చెప్పేది ఏమిటంటే 55% అప్పులు, ఆస్తుల సృష్టికి కాకుండా, కేవలం జీవన ఖర్చుల కోసమే తీసుకోబడుతున్నాయి. క్రెడిట్ కార్డుల వాడకం, వ్యక్తిగత రుణాలు, ఇఎంఐలు ఈ ధోరణికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. సామాన్యుడు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటిది, నిత్యావసర వస్తువుల ధరలు గత 11 ఏళ్లలో దాదాపు 300 శాతం పెరిగాయి. ఆహారం, ఇంధనం, గృహ ఖర్చులు, విద్య, వైద్యం వంటి అంశాలు సామాన్యుడికి భారంగా మారాయి.రెండవది, ద్రవ్యోల్బణం పెరిగినా, వేతనాలు దానికి అనుగుణంగా పెరగలేదు. చాలీచాలని జీతాలతో కుటుంబ ఖర్చులను భరించలేక, ప్రజలు అప్పులపై ఆధారపడుతున్నారు. మూడవది, నైపుణ్యానికి తగిన ఉపాధి అవకాశాలు తగ్గాయి. యువతలో నిరుద్యోగం రేటు గత కొన్నేళ్లలో గణనీయంగా పెరిగింది, ఇది ఆర్థిక అస్థిరతకు దారితీస్తోంది. ఈ పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలు– ఉదాహరణకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై), ఆయుష్మాన్ భారత్– పేదలకు సహాయం చేసే లక్ష్యంతో రూపొందించబడ్డాయి. అయితే, ఈ పథకాలు అమలులో లోపాలు, అవగాహన లేమి లేదా అర్హత సమస్యల వల్ల సామాన్యుడికి పూర్తి ప్రయోజనం చేకూరడం లేదుపిఎంఎవై కింద గృహ రుణాలపై సబ్సిడీలు అందుతున్నప్పటికీ అర్హత నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియలు సంక్లిష్టంగా ఉండటం వల్ల చాలా మంది ఈ ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ వంటి విమర్శకులు, మోడీ ప్రభుత్వం గత 11 ఏళ్లలో సామాన్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విఫలమైందని ఆరోపిస్తున్నారు. అచ్చేదిన్ నినాదంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం, వాస్తవానికి ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టిందని వాదిస్తున్నారు. ఒక వైపు సామాన్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే, ప్రభుత్వానికి సన్నిహిత వ్యాపార వేత్తలు మాత్రం అపార సంపదను సృష్టించుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు, ఉదాహరణకు, ఐటి హార్డ్‌వేర్, బయో టెక్నాలజీ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ ఈ ప్రయోజనాలు ప్రధానంగా కార్పొరేట్ రంగానికే చేకూరుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంక్షోభాన్ని తగ్గించడానికి, ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. మొదట ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలి.నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించడం అత్యవసరం. రెండవది, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలి. మూడవది, రుణాల విషయంలో పారదర్శకత, సురక్షిత రుణవిధానాలను అమలు చేయాలి. అంతేకాక సామాన్యులకు విద్య, వైద్యం, గృహసౌకర్యాలు అందించే పథకాలు సులభతరం చేయాలి. తద్వారా వారు అప్పులపై ఆధారపడకుండా ఉండగలరు. మోడీ పాలనలో దేశం కొన్ని రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ, సామాన్యుడి జీవనపరిస్థితులు మాత్రం ఆశాజనకంగా లేవు.

# జాతి వివక్షత పై పోరాడిన నల్ల సూరీడు నెల్సన్ మండేలా



( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

**-భారతరత్న పొందిన విదేశీయుడు**

**-జులై 18 "మండేలా డే" నేడు నెల్సన్ మండేలా జయంతి**

నెల్సన్ మండేలా..! ఓ స్వాప్నికుడు...శాంతి కాముకుడు...విశ్వ శాంతికి సంకేతం... పీడనకు, దోపిడీకి, భయానికి తావులేని సమాజం కావాలనేది ఆయన కల. దక్షిణాఫ్రికా విమోచనోద్యమానికి జీవం. మనిషిని పశువుగానో, పనిముట్టుగానో చూడటంపై నిప్పులు చెరిగిన పోరాట యోధుడు. జాతి వివక్ష, దోపిడీ, బానిసత్వంపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన ధిక్కార పతాకం. దక్షిణాఫ్రికాలో దశాబ్దాలుగా కొనసాగిన వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించి 27 ఏండ్లు జైల్లో నిర్భంధిచబడిన వాడు. జాత్యహంకార శ్వేత జాతి ప్రభుత్వం పాటిస్తున్న వివక్షను నిరసిస్తూ ఉద్యమించి నల్ల జాతీయులకు విముక్తి కల్పించిన వీరుడు " నెల్సన్ మండేలా ". అందుకే ప్రపంచంలో ప్రజలను విముక్తి చేయటం కోసం పోరాడిన అతికొద్ది మందిలో ఒకరిగా కీర్తి పొందారు. భౌతికంగా ప్రపంచానికి దూరమైనప్పటికీ, మానవాళి ఉన్నంత కాలం, వివక్ష, అణిచివేత ఉన్నంతకాలం నెల్సన్ మండేలా బతికే ఉంటాడు. సమాజ పరిణామ క్రమంలో బానిసత్వంపై తిరుగుబాటు చేసిన మొదటి తరానికి చెందిన స్పార్టకస్, ఏసుక్రీస్తు పేర్లు ఎలాగైతే అజరామరంగా చలామణిలో ఉంటున్నాయో, విముక్తి ఉద్యమాలు జరిగే చోట, దోపిడి, అణిచివేతలు జరిగే చోట వీరి పేరు ఎలా ప్రతిధ్వనిస్తున్నాయో...అలాగే 21వ శతాబ్దపు విముక్తి ఉద్యమ వీరుడిగా నెల్సన్ మండేలా పేరు కూడా ప్రతి ధ్వనిస్తూనే ఉంటుంది. అణిచివేతలో మగ్గిపోయి మసిబారిన బొమ్మల్లా ఉన్నవారి కోసం జీవితకాలం ఉద్యమాన్ని కొనసాగించటమే కాదు, తరతరాలుగా తలలు వంచుకొని బ్రతికిన వారిని బ్యాలెట్ ( ఓటుహక్కు ) వరకూ తీసుకెళ్లి వారిని జీవమున్న " మనుషులుగా " నిటారుగా నిలబెట్టెందుకు నేలను చీల్చుకుంటూ ఎగిసిపడిన స్వేచ్ఛా పతాక నెల్సన్ మండేలా. అనేక దశాబ్దాల పాటు కొనసాగిన ఉద్యమం ఫలితంగా 1994 ఏప్రిల్ 26వ తేదీన ఉదయాన్నే పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడిన ఒక ఆఫ్రికన్ యువకుడు తనను పలకరించిన ఓ ఇంగ్లీష్ పత్రిక విలేకరితో " ఇప్పుడు నేను మనిషి " అన్న మాట వెనుక వందల వేల మంది ఆత్మార్పణ ఉంది. త్యాగం ఉంది. వారి రక్తం ఉంది. పోరాట యోధుల చిత్ర హింసలున్నాయి. అందుకే దక్షిణాఫ్రికాకు నెల్సన్ మండేలా మొదటి నల్లజాతి అధ్యక్షుడిగా అధికారం చేపట్టినప్పుడు " నేల మీద నడిచే దేవ దూత " అంటూ కొనియాడారు. దక్షిణాఫ్రికా శాంతియుత పరిణామానికి ఎంతగానో పొగడ్తలు, ప్రసంసలు లభించాయి. దక్షిణాఫ్రికా జాతిపితగా, ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడిగా ప్రజల ఆదరణ పొందాడు. ఆఫ్రికా జాతి విముక్తి నేతగా పేరొందాడు. నెల్సన్ మండేలా జ్ఞాపకార్థం వివిధ నగరాల్లో మండేలా విగ్రహాలు ప్రతిష్ఠితమయ్యాయి. 1993లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్నాడు. జాతి వివక్ష నిర్మూలన కోసం మండేలా జరిపిన పోరాటానికి గుర్తుగా ఆయన పుట్టినరోజు జూలై 18 " మండేలా డే " గా ఐరాస జనరల్ అసెంబ్లీ 2009 నవంబర్ లో ప్రకటించింది. 1990లో భారత అత్యున్నత పౌరపురస్కారం భారతరత్న ప్రకటించింది. బ్రతికుండగానే ఇలాంటి గౌరవం, పురస్కారాలు అందుకున్న నెల్సన్ మండేలా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు. అయితే ప్రపంచ శాంతి అనేది ఒక నినాదంగానే ఉందనేది గుర్తించాలి. ఈ మధ్యకాలంలో అమెరికాలో చోటుచేసుకున్న జాత్యహంకారం ఘటనలు కావచ్చు, మన దేశంలో ఇలాంటి ఘటనలోనే తండ్రీకొడుకులు హతమైన ఘటన కావచ్చు ఇలాంటి మరెన్నో వివక్ష, అణిచివేత దోరణులకు అద్దం పడుతున్నాయి. ఈ తరుణంలో జాతి విముక్తి కోసం, నల్లజాతీయుల యోధుడు నెల్సన్ మండేలా స్ఫూర్తిని పునికిపుచ్చుకోవాలి. జులై 18 "మండేలా డే" ( నెల్సన్ మండేలా పుట్టిన రోజు ) సందర్భంగా నెల్సన్ మండేలాను స్మరించుకుందాం.

# ఏఐ సాయంతో రైల్వేల్లో సీసీటీవీలు



ముంబై, జూలై 17,రైలు ప్రయాణం తక్కువ ఖర్చుతోపాటు సుఖవంతమైన ప్రయాణాన్ని కూడా అందిస్తుంది. ఇక దూర ప్రాంతాలకు వెళ్లేవారికి రైలు ప్రయాణం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. అందుకే కొన్ని రూట్లలో నెలలకు ముందే టికెట్లు బుక్ చేసుకుంటూ ఉంటారు. అయితే రైలు ప్రయాణాల్లో కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. రైలు ప్రయాణాల్లో దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు.. రైల్వే శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి రైళ్లలో కెమెరాలు బిగించి.. ఏం జరుగుతుందో తెలుసుకోనుంది. ఇంతకీ ఈ కెమెరాలు ఎక్కడ బిగిస్తారు. వాటి వల్ల ప్రయాణికుల ప్రైవసీకి భంగం కలగకుండా ఎలా చర్యలు తీసుకుంటారుభారతీయ రైల్వేలు రోజురోజుకూ సరికొత్తగా మారిపోతున్నాయి. అత్యాధునిక రైళ్లు, రైలు మార్గాల విస్తరణ, చీనాబ్ లాంటి ప్రపంచంలోనే ఎత్తైన బ్రిడ్జి నిర్మాణం, ప్రయాణికుల సౌకర్యం కోసం ఎన్నో చర్యలను రైల్వే శాఖ చేపడుతూనే ఉంది. అదే సమయంలో రైలు ప్రమాదాలను తగ్గించేందుకు.. కవచ్ లాంటి టెక్నాలజీని ప్రవేశపెట్టింది. రైల్వే ఆధునీకరణ వైపు అడుగులు పెడుతున్నప్పటికీ.. కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. రైళ్లలో దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వ్యక్తులు, టికెట్ లేకుండా ప్రయాణించేవారు.. ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఒంటరిగా ప్రయాణించే మహిళలు, యువతులు.. ఇలాంటి ఘటనలపై ఫిర్యాదులు చేయడం.. ప్రయాణికుల భద్రతకు సవాల్ విసురుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రైలు ప్రయాణికుల భద్రతకు రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా రైళ్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి.. భద్రతను పటిష్ఠం చేసి, ప్రయాణికులకు మెరుగైన ప్రయాణాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.10 ఏళ్లలో రైల్వే శాఖ ఎంత అప్‌డేట్ అయిందో, అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఎలా దూసుకెళ్తుందో మనం చూస్తూనే ఉన్నాం. ఇప్పటికే వందే భారత్ రైళ్లు.. సూపర్ సక్సెస్ కాగా.. త్వరలోనే వందే భారత్ స్లీపర్ రైళ్లు కూడా పరుగులు పెట్టనున్నాయి. మరోవైపు.. బుల్లెట్ రైలు ప్రాజెక్టు కూడా శరవేగంగా పూర్తి చేసుకునేందుకు సిద్ధం అవుతోంది. ఈ నేపథ్యంలోనే రైల్వే వ్యవస్థలోనే మరో విప్లవాత్మక మార్పుకు సిద్ధం అవుతోంది. రైళ్లలో సీసీటీవీ కెమెరాలను అమర్చాలని కీలక నిర్ణయం తీసుకుంది. రైల్వే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది.

3.86 లక్షల కెమెరాలు రైల్వే ప్రయాణికుల భద్రతను పెంచడంలో భాగంగా.. దేశంలోని అన్ని ప్యాసింజర్ కోచ్‌లు, లోకోమోటివ్‌లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. మొత్తం 74 వేల కోచ్‌లు, 15 వేల లోకోమోటివ్‌లలో ఈ కెమెరాలను అమర్చనున్నట్లు వెల్లడించింది. ఇందుకోసం సుమారు 3.86 లక్షల సీసీ కెమెరాలు అవసరం అవుతాయని తెలిపింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర రైల్వే సహాయ మంత్రి రవణీత్ సింగ్ బిట్టు ఆమోదం తెలిపారు.రైల్వే మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ప్యాసింజర్ కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలను పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయగా.. అందులో మంచి ఫలితాలు రావడంతో.. దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రైళ్లలో కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల.. రైలు ప్రయాణికులకు మరింత భద్రతను అందించవచ్చని సంబంధిత అధికారులు వెల్లడించారు. రైళ్లలో దుండగులు, కొన్ని ముఠాలు అమాయక ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నాయని.. కెమెరాల ఏర్పాటుతో అలాంటి ఘటనలు తగ్గించవచ్చని రైల్వే మంత్రిత్వ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది.సాధారణంగా రైలు ప్రయాణం అంటేనే.. ఎక్కడి నుంచో ఎక్కడికి వెళ్లేవాళ్లు ఎక్కుతూ ఉంటారు. ఏ స్టేషన్‌లో ఎక్కుతారో ఏ స్టేషన్‌లో దిగుతారో పక్కవారికి అస్సలు తెలియదు. అందులో సాధారణ ప్రయాణికులతోపాటు దొంగలు, కిడ్నాప్ ముఠాలు, దోపిడీదారులు, హంతకులు, డ్రగ్స్ సేవించేవారు, ఆల్కహాల్ సేవించేవారు, పొగ తాగేవారు ఉంటారు. ఇలాంటి వాళ్ల వల్ల మిగిలిన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయి. రాత్రివేళల్లో ప్రయాణికులు అంతా నిద్రపోతున్న సమయంలో దొంగతనాలు చేస్తారు. మెడలో ఉన్న గొలుసులు లాగేసుకుపోతారు. అడ్డగిస్తే.. హతమార్చేందుకు కూడా వెనుకాడని వారు ఉంటారు. ఇలాంటి ఘటనలను ఎంతో కొంత అడ్డుకోవడానికి ఈ సీసీటీవీల ఏర్పాటు ఉపయోగపడుతుందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.రైళ్లలో కెమెరాలు ఏర్పాటు చేస్తామని రైల్వే శాఖ చేసిన ప్రకటనతో తమ ప్రైవసీకి భంగం కలుగుతుందని కొందరు ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రయాణికుల గోప్యతకు ఎలాంటి భంగం కలగదని తేల్చి చెప్పింది. ప్రయాణికుల ప్రైవసీని దృష్టిలో పెట్టుకుని.. సీసీ కెమెరాలు ఎక్కడ ఏర్పాటు చేయాలి అనేది నిర్ణయించినట్లు తెలిపింది. బోగీ డోర్ల వద్ద ఉన్న ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రాంతంలో మాత్రమే కెమెరాలను ఏర్పాటు చేస్తామని రైల్వే మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.ప్రతి ప్యాసింజర్ కోచ్‌లో మొత్తం 4 డోమ్ టైప్ సీసీ కెమెరాలు అమర్చనున్నారు. బోగికి ఇరువైపుల ఉన్న ఎంట్రీల వద్ద రెండు చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఇక లోకోమోటివ్‌లకు మొత్తం 6 కెమెరాలు బిగించనున్నారు. ముందు, వెనుక, రెండు వైపులా ఒక్కొక్కటి చొప్పున కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు లోకోలోని ప్రతి క్యాబ్ (ముందు, వెనుక) ఒక డోమ్ సీసీ కెమెరా సహా 2 డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్‌లతో అమర్చనున్నారు.రైల్వే శాఖ ఏర్పాటు చేయనున్న సీసీటీవీ కెమెరాలు అత్యాధునిక టెక్నాలజీ కలిగి ఉండనున్నాయి. హై క్వాలిటీ గల కెమెరాలు, ఇతర పరికరాలను మాత్రమే వినియోగించాలని.. రైల్వే బోర్డు సీనియర్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో.. కేంద్రమంత్రి రవణీత్ సింగ్ బిట్టు సూచించారు. రాత్రి వేళల్లో స్పష్టంగా కనిపించడమే కాకుండా.. రైలు గంటకు 100 కిలోమీటర్లకు పైగా వేగంతో వెళ్తున్నా.. కెమెరాలు రికార్డ్ అయ్యేలా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఇండియాఏఐ మిషన్‌తో కలిసి సీసీటీవీ కెమెరాల ద్వారా సేకరించిన డేటాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించాలని కేంద్రమంత్రి సూచించారు. రైళ్లలో అనుమానాస్పద కదలికలను ఆటోమేటిక్‌గా గుర్తించడం, రియల్ టైమ్ హెచ్చరికలు చేయడం, ప్రయాణికుల రద్దీని విశ్లేషించడం వంటి సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఏఐ ఉపయోగపడుతుందని తెలిపారు.రైళ్లలో లక్షలాది సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం భారీ ఖర్చుతో కూడుకున్న పని అని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టుకు సుమారు రూ.8,300 కోట్ల నుంచి రూ.12,500 కోట్ల మధ్య ఖర్చవుతుందని తెలుస్తోంది. ఈ కెమెరాల ఏర్పాటులో 3.86 లక్షల సీసీటీవీలు మాత్రమే కాకుండా వాటికి సంబంధించిన పూర్తి పరికరాలు, వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయిన డేటాను నిల్వ చేసేందుకు వ్యవస్థలు.. కమాండ్ కంట్రోల్ సెంటర్లు, వీడియో అనలిటిక్స్ సాఫ్ట్‌వేర్, సైబర్ సెక్యూరిటీ టూల్స్, వీటన్నింటి మెయింటెనెన్స్ ఉండాలి.ప్రయాణికుల భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణం కోసం రైల్వే శాఖ ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా ఉన్న రైళ్లలో సీసీటీవీలు ఏర్పాటు చేయడం భద్రతపరంగా ప్రయాణికులకు మరింత ధైర్యం కలగనుంది. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించుకుంటూ.. ప్రయాణికుల ప్రైవసీకి భంగం కలగకుండానే రక్షణ కల్పిస్తామని రైల్వే శాఖ హామీ ఇస్తోంది. రైల్వే శాఖ తీసుకున్న ఈ నిర్ణయం.. అభినందించదగిందే కదూ!

# దేశంలో కొత్తగా 200 చమురు బావులు

జైపూర్ జూలై 17,భారత్.. ప్రపంచంలో ఎక్కువ చమరు దిగుమతి చేసుకునే దేశాల్లో మూడోస్థానంలో ఉంది. దేశ అవసరాల్లో కేవలం 15 శాతం మాత్రమే భారత్‌లో ఉత్పత్తి అవుతోంది. 85 శాతం గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అయితే ఉక్రెయిన్?రష్యా యుద్ధం నేపథ్యంలో రష్యా క్రూడ్ ఆయిల్‌ను భారత్‌కు చౌకగా సరఫరా చేస్తోంది. దీనికి చెక్ పెట్టేందుకు అమెరికా, నాటో, గల్ఫ్ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. రష్యా ఆయిల్ కొనుగోలు చేస్తే భారత్‌పై వంద శాతం సుంకాలు విధిస్తామని అమెరికా, నాటో తాజాగా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అమెరికాతోపాటు, గల్ఫ్ దేశాలకు షాక్ ఇచ్చేలా భారత్ ప్రణాళికా రూపొందించింది. రాజస్థాన్‌లోని బాడ్‌మేర్?సాంచోర్ ప్రాంతంలో చమురు నిల్వల ఆవిష్కరణ భారత ఇంధన రంగంలో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. థార్ ఎడారిలో గుర్తించిన ఈ నిల్వలు దేశ ఇంధన స్వావలంబన లక్ష్యానికి ఊతం ఇవ్వనున్నాయి.రాజస్థాన్‌లోని బాడ్‌మేర్ బేసిన్ భారతదేశంలో అతిపెద్ద ఆన్‌షోర్ చమురు క్షేత్రాలలో ఒకటి. 2004లో గుర్తించిన మంగళ, భాగ్యం, ఐశ్వర్య క్షేత్రాలు 2009 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాయి. ఈ క్షేత్రాలు దేశంలోని మొత్తం క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిలో సుమారు 29% తీరుస్తున్నాయి. 2022లో రాజస్థాన్ నుంచి 5.9 మిలియన్ మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి అయింది. అయితే 2023 నాటికి ఈ మొత్తం 3.9 మిలియన్ టన్నులకు తగ్గింది. ఈ క్షీణత సహజంగా ఉన్న క్షేత్రాల నీటిపారుదల వల్ల సంభవించింది. 2022లో వేదాంత సంస్థ 2017/1 బ్లాక్‌లో దుర్గా?1 అనే చమురు నిల్వను గుర్తించింది. అయితే, దీని వాణిజ్య సాధ్యత ఇంకా పరీక్షలో ఉంది.తాజాగా బాడ్‌మేర్ బేసిన్‌లో 200 కొత్త చమురు బావుల తవ్వకం చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఈమేరకు వేదాంత సంస్థకు చెంది టైర్ సంస్థ ముందుకు వచ్చింది. ఇందుకోసం ప్రణాళిక సిద్ధమైంది. త్వరలోనే బావుల తవ్వకం ప్రారంభించే అవకాశం ఉంది. ఇందుకు అమెరికా, కెనడా, రష్యా, ఆస్ట్రేలియాకు చెందిన సంస్థలు భారీ ఎక్విప్ మెంట్ తో భారత్‌కు రానున్నాయి. రష్యా ఆయిల్ సరఫరాను అడ్డుకునేందుకుఅమెరికా,నాటో దేశాలు ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో 200 బావుల్లో క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి జరిగితే మన దేశ అవసరాలకు పోనూ ఇంకా మిగిలే అవకాశం కూడా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. అప్పుడు భారత్ కూడా గల్ఫ్ దేశాల తరహాలో ఎగుమతి చేసే అవకాశం ఉంది. పెట్రో ధరలు తగ్గి దేశ ఆర్థికవృద్ధి కానుంది. సామాన్యులకు ఇదో గొప్ప ఊరట.. ఆర్థిక స్వావలంబనకు దోహదపడనుంది. అదే జరిగితే గల్ఫ్ దేశాలు నమ్మకమైన అతిపెద్ద దిగుమతిదారును కోల్పోవడంతోపాటు, పోటీదారును ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అమెరికా, నాటో సహా పాశ్చాత్య దేశాల బెదిరింపులకు భారత్ భయపడాల్సిన అవసరం అగత్యం ఉండదు.

## శ్రీధర్ ఆస్తుల చిట్టా... చాంతాడంతా...

హైదరాబాద్, జూలై 17, నీటిపారుదల శాఖలో రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధరరావును అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. నిన్న ఏసీబీ అధికారులు పదిచోట్ల ఏకకాలంలో సోదాలు జరిపారు. ఆదాయానికి మించిన ఆస్తులున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. కోట్లాది రూపాయల అక్రమార్జన బయటపడిందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. మురళీధరరావును అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చి జైలుకు పంపారు. ఆయనను కస్టడీలోకి తీసుకుని మరింత విచారించే అవకాశముందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. మురళీధరరావు ఆస్తులు చూస్తే కళ్లు తిరగాల్సిందే. ఆయన ఆస్తుల విలువ నాలుగు వందల కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ లో విలువైన భూములు, ఇంటి స్థలాలలతో పాటు పవర్ ప్రాజెక్టు, ఖరీదైన ఫ్లాట్లు, ఇంటి స్థలాలు, విల్లాతో పాటు బంగారం, వెండి ఆభరణాలను ఉన్నట్లు కనుగొన్నారు. ఇక బ్యాంకు లాకర్లను కూడా తెరవాల్సి ఉంది. అది తెరిస్తే ఇంకా ఎన్ని ఆస్తులు బయటపడతాయోనంటున్నారు. హైదరాబాద్ లోని మోకిలాలో 6,500 చదరపు గజం స్థలం ఉంది. అలాగే హైదరాబాద్ శివార్లలో పదకొండు ఎకరాల సాగు భూమి కూడా ఉంది.

# తెలంగాణలో స్థానిక సంస్థల సంఖ్య ఖరారు

హైదరాబాద్, జూలై 17, రాష్ట్రంలోని జెడ్పీ, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలపై తెలంగాణ ప్రభుత్వం ప్రకటన చేసింది. జడ్పీలు 31, ఎంపీపీలు 566, జడ్పీటీసీలు 566, ఎంపీటీసీలు 5,773, గ్రామపంచాయతీలు 12,778, వార్డులు లక్షా 12 వేలు ఉన్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను బుధవారం ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు.. 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు వెల్లడించింది.రాష్ట్రంలో మొత్తం 12,778 గ్రామ పంచాయతీలు ఉండగా? 1.12 లక్షల వార్డులు ఉన్నట్లు ప్రభుత్వం వివరించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో వీటిపై ప్రకటన చేసింది.మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధం కావాలని పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఎన్నికలకు అవసరమయ్యే సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది.ఏర్పాట్లు ముమ్మరంతెలంగాణలో స్థానిక ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ఓవైపు ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకువేస్తుండగా? మరోవైపు ఏర్పాట్ల ప్రక్రియపై ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ప్రక్రియను కూడా పూర్తి చేసింది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే? షెడ్యూల్ విడుదల చేసేందుకు సిద్ధమైంది.రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ? ఈసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకునే పనిలో పడింది. అయితే అధికారంలోకి రాకముందు నుంచే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిన ఆ పార్టీ?. కామారెడ్డిలో డిక్లరేషన్ కూడా చేసింది. కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా?. అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కులగణన చేపట్టింది. డెడికేషన్ కమిషన్ కూడా ఏర్పాటు చేసింది. అసెంబ్లీలో తీర్మానం కూడా చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి కూడా పంపింది.కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ఆర్డినెన్స్ జారీకి కేబినెట్ నిర్ణయించింది. అయితే శాసనసభ, మండలిలను ప్రొరోగ్ చేయకుండా ఆర్డినెన్స్ తీసుకురావడానికి నిబంధనలు అంగీకరించవు. ఈ నేపథ్యంలో?. శాసనసభ, మండలిలను ప్రొరోగ్ చేస్తూ గవర్నర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో త్వరలోనే ఆర్డినెన్స్ జారీ అయ్యే అవకాశం ఉంటుంది.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ ఆధారంగా? స్థానిక ఎన్నికల ప్రక్రియ మరింత వేగవంతమవుతుంది. ఆ వెంటనే రిజర్వేషన్లపై ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంటుంది. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ లకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారవుతాయి. అయితే గతంలో ఉన్న రిజర్వేషన్లే అమల్లో ఉంటాయా?? లేక ఏమైనా మార్పులు ఉంటాయా?? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఇచ్చే ఆర్డినెన్స్ నిలబడుతుందా అన్న చర్చ గట్టిగా తెరపైకి వస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు 50 శాతం రిజర్వేషన్లు దాటవద్దనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ తీసుకువచ్చే ఆర్డినెన్స్ పై అనేక అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కోర్టుల ముందుకు ఈ ఆర్డినెన్స్ నిలబడవనే విశ్లేషణలు తెరపైకి వస్తున్నాయి. బీసీల రిజర్వేషన్ల పెంపు బిల్లులను 9వ షెడ్యూల్ చేర్చి? పార్లమెంటు ఆమోదం పొందే దిశగా ముందుకెళ్తే తప్పు? రిజ్వేషన్ల పెంపు సాధ్యం కాదని పలువురు చెబుతున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉంది. ఈ నేపథ్యంలో ఇదే బిల్లుకు సంబంధించి ఆర్డినెన్స్ ఇవ్వొచ్చా అన్న చర్చ కూడా తెరపైకి వస్తోంది.ప్రస్తుత గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 12,777 గ్రామ పంచాయతీలున్నాయి. 5,982 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, 585 జడ్పీటీసీ స్థానాలు ఉండగా?

వీటన్నింటికి ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆర్డినెన్స్ జారీ తర్వాత? ఎన్నికల ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశం ఉంటుంది. మరోవైపు సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఒక వేళ ఆర్డినెన్స్ జారీపై న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతే?. ప్రభుత్వం ఎలా ముందుకెళ్తోందనేది కూడా చర్చనీయాంశంగా మారింది?!రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ? ఈసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది. క్షేత్రస్థాయిలో ఉన్న నేతలు కూడా?. పార్టీ గెలుపు కోసం కృషి చేసే దిశగా అడుగులు వేసే పనిలో ఉన్నారు. హస్తం జెండా ఎగరవేయటమే లక్ష్యంగా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పావులు కదిపేస్తున్నారు. షెడ్యూల్ వచ్చే నాటికే గ్రౌండ్ క్లియర్ గా ఉండాలని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది. ఇక అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోని స్థానిక పోరులో సత్తా చాటాలని బీఆర్ఎస్ తో పాటు బీజేపీ చూస్తున్నాయి.రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని ఆశావాహులు పావులు కదిపేస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టత రాగానే? మరింత దూసుకెళ్లాలని భావిస్తున్నారు. చాలా రోజులుగా గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. గెలుపు కోసం అవసరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈసీ నుంచి ప్రకటన వెలువడితే? పల్లెల్లో పొలిటికల్ హీట్ మరింత పెరగనుంది.రాష్ఠంలోని గ్రామపంచాయతీల్లోని సర్పంచ్ లో పదవీ కాలం గతేడాది జనవరి 31వతో ముగిసింది. ఆ తర్వాత నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. 2024 జూన్ మాసంలోనే ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసింది. ఈ స్థానాలకు కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. పదవీకాలం ముగిసిన తర్వాత వెంటనే నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ? ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఆ తర్వాత కుల గణన కార్యక్రమం చేపట్టడంతో ఆలస్యమైంది.=

## కగార్.. సింధూర్... ఇప్పుడు కాలనేమి

తిరువనంతపురం, జూలై 17,ఆపరేషన్ సిందూర్.. ఇటీవల పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు భారత్ చేపట్టిన ఆపరేషన్ ఇది. ఇక ఆపరేషన్ కగార్.. ప్రస్తుతం ఇది దేశంలో కొనసాగుతోంది. 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ ఆపరేషన్ కొనసాగిస్తోంది. ఆపరేషన్ కాలనేమి కూడా దేశంలోని ఒక రాష్ట్రంలో జరుగుతోంది.దేవభూమిగా గుర్తింపు పొందిన రాష్ట్రం ఉత్తరాఖండ్. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో చార్‌ధామ్, కావడి యాత్రలు జరుగుతున్నాయి. అనేక పుణ్యక్షేత్రాలకు కొలువై ఉన్న ఉత్తరాఖండ్‌లో కొన్నేళ్లుగా నకిలీ బాబాల బెడద పెరిగింది. ఈ నకిలీ సాధువులు భక్తులను మోసం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. కొందరిని బెదిరిస్తున్నారు. కొందరిని దూషిస్తున్నారు. ఈ సాధువుల్లో కొందరు బంగ్లాదేశ్‌కు చెందినవారు ఉన్నారు. వీరు రహస్యంగా ఉగ్రకార్యకలాపాలకు మద్దతు ఇచ్చే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో దేశ భద్రత మరియు ఆధ్యాత్మిక సామరస్యాన్ని కాపాడటానికి పుష్కర్‌సింగ్ ధామి ప్రభుత్వం ఈ ఆపరేషన్ కాలనేమి చేపట్టిందికాలనేమి అనేది రామాయణంలోని ఒక రాక్షసుడి పేరు, రావణుడి ఆదేశంతో సాధువు వేషంలో హనుమంతుడిని మోసం చేయడానికి ప్రయత్నించిన వ్యక్తి. హనుమంతుడు అతని మోసాన్ని గుర్తించి సంహరించాడు. ఈ పురాణ కథ నుంచి ప్రేరణ పొంది, ఉత్తరాఖండ్ ప్రభుత్వం 'ఆపరేషన్ కాలనేమి' అనే పేరును ఎంచుకుంది. ఇది సాధువుల వేషంలో మోసాలు చేసే వ్యక్తులను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఉద్దేశించబడిందిఉత్తరాఖండ్‌లో, ముఖ్యంగా చార్‌ధామ్ యాత్ర, కావడి యాత్ర సమయంలో, నకిలీ సాధువులు భక్తులను మోసం చేస్తున్నారు. వీరు డబ్బు కోసం భక్తులను బెదిరిస్తూ, తప్పుదారి పట్టిస్తూ, శాపనార్థాలు పెడుతున్నారు. ఈ మోసాలు భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీస్తూ, సనాతన ధర్మం పవిత్రతను కలుషితం చేస్తున్నాయి. ఈ సమస్యను గుర్తించిన ఉత్తరాఖండ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆధ్వర్యంలో, ఈ మోసగాళ్లను అరికట్టేందుకు ఆపరేషన్ కాలనేమిని ప్రారంభించిందిఆపరేషన్ కాలనేమి ద్వారా ఒక్క రోజులోనే 127 మంది నకిలీ సాధువులను అరెస్టు చేశారు. వీరిలో ఒక బంగ్లాదేశీయుడు కూడా ఉన్నాడు. ఈ వ్యక్తుల వద్ద నకిలీ ఆధార్ కార్డులు స్వాధీనం చేయబడ్డాయి, ఇది దేశ భద్రతకు సంబంధించిన ఆందోళనలను లేవనెత్తింది. ఈ చర్యలు డెహ్రాడూన్, హరిద్వార్, ఉధమ్ సింగ్ నగర్ జిల్లాలలో నిర్వహించబడ్డాయి. ఈ ఆపరేషన్ గతేడాది నుంచి ఉత్తరప్రదేశ్‌లో కూడా కొనసాగుతోంది. ఈ ఆపరేషన్ కేవలం మతపరమైన మోసాలను అరికట్టడానికి మాత్రమే కాకుండా, దేశ భద్రతను రక్షించడానికి కూడా ఉద్దేశించబడింది. నకిలీ గుర్తింపు కార్డుల ఉనికి, బంగ్లాదేశీ నాగరికుడి అరెస్టు అక్రమ ఇమ్మిగ్రేషన్, ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఆందోళనలను లేవనెత్తాయి. గతంలో గుజరాత్‌లో 550 మంది బంగ్లాదేశీ అక్రమ ఇమ్మిగ్రెంట్ల అరెస్టు ఈ సమస్య తీవ్రతను సూచిస్తుంది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈ ఆపరేషన్‌ను ఏ మతానికి పరిమితం చేయకుండా, మోసాలు చేసే ఎవరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఏ క్షణమైనా నోటిఫికేషన్

నిజామాబాద్, జూలై 17,తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఖరారుతో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. హైకోర్టు ఆదేశాలతో సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీకి సంబంధించి ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం యోచిస్తున్నట్లు సమాచారం. మరి గ్రామీణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో వేచి చూడాల్సిందే..స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. మొత్తం 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ క్షణంలోనైనా జరగవచ్చనే సంకేతాలను వెలువడుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖను ఆదేశించింది. ఎన్నికలకు అవసరమయ్యే సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని కూడా నిర్దేశించింది.సెప్టెంబర్ 30వ తేదీలోగా తెలంగాణలో స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన ఆర్డినెన్స్‌ను సిద్ధం చేసి ఇప్పటికే గవర్నర్‌కు పంపింది. గవర్నర్ ఆమోదం లభించిన వెంటనే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు అధికారికంగా తెరలేవనుంది.రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఐదు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వర్షాకాలం, శాంతిభద్రతల పరిస్థితి, గిరిజన ప్రాంతాలకు పోలింగ్ సిబ్బంది రవాణా, పోలింగ్ మెటీరియల్ తరలింపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2019లో ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించగా, అప్పుడు వేసవి కావడంతో అది సాధ్యమైంది.ఇప్పుడు వర్షకాలం కావడం, దానివల్ల ఎదురయ్యే ఇబ్బందులను అంచనా వేసి ఈసారి ఐదు విడతల్లో నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారాన్ని అందించిన వెంటనే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు కసరత్తు జరుగుతోంది. పోలింగ్ స్టేషన్లు, ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల పోలింగ్ సిబ్బంది, పోలీసుల తరలింపు సులువు అవుతుందని, పర్యవేక్షణలోనూ ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. వర్షాల వల్ల రవాణాకు, ఓటింగ్‌కు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయానికి వచ్చారు.నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ వరకు మధ్య ప్రక్రియను పూర్తి చేయడానికి దాదాపు 15 రోజుల సమయం అవసరం. 2019 ఎన్నికల సమయంలో ఒక్కో దశకు నాలుగు రోజుల విరామం ఇవ్వగా, ఈసారి రెండు నుంచి మూడు రోజులు మాత్రమే ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారం అందించిన తర్వాత, పోలీసు అధికారులతో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటారు. , జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రెండు ఎన్నికలకు ఒకే రోజు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలో గ్రామీణ, మండల స్థాయిలో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి మార్గం సుగమం చేయనున్నాయి.

## యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణ




నల్గొండ, జూలై 17, తెలంగాణ రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో ముఖ్యమైన అడుగు వేసింది. ఘట్కేసర్ నుంచి యాదాద్రి వరకు 33 కిలోమీటర్ల దూరంలో మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ విస్తరణకు కేంద్ర రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టును సాధించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.100 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేసింది.ఈ నిర్ణయంపై భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి రైల్వే మంత్రిత్వ శాఖకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు భువనగిరి ప్రజల భవిష్యత్‌కు సరికొత్త బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో ఈ ప్రాజెక్టు కోసం డిమాండ్ వినిపిస్తోంది. ఏడాది ఏప్రిల్ నెలలో కూడా పార్లమెంట్‌లో ఈ అంశాన్ని కాంగ్రెస్ ఎంపీలు లేవనెత్తారు. జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ రూట్ పొడిగిస్తే యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయానికి వెళ్లే భక్తులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వాదించారు. అప్పట్లో కాంగ్రెస్ ఎంపీలు వేసిన ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వివరణాత్మక సమాధానం ఇచ్చారు. కేంద్రం సహకారం పూర్తిగా ఉంటుందని అప్పుడే తెలిపారు. చెప్పినట్టుగానే ఇప్పుడు ఘట్కేసర్ నుంచి యాదాద్రి వరకు 33 కిలోమీటర్ల విస్తరణ ప్రాజెక్టును ఓకే చెప్పింది. ఈ ప్రాజెక్టుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.100 కోట్లు మొదటి విడతగా కేటాయించింది. ఈ నిధుల విడుదలతో పాటు, భూసేకరణ, ఇతర ముందస్తు పనులు వేగవంతం చేయడానికి అవకాశం కల్పించింది. విస్తరణ రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణిస్తున్నారు. ఈ 33 కిలోమీటర్ల ప్రాజెక్టు ద్వారా, ఘట్కేసర్ నుంచి యాదాద్రి వరకు సుస్థిర, వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఈ మార్గం ప్రధానంగా యాదాద్రి దేవాలయానికి వెళ్లే లక్షల మంది భక్తులకు, సమీప ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది. ఈ ప్రాజెక్టు పూర్తైన తర్వాత, రోడ్డు రవాణా ఒత్తిడిని తగ్గిస్తుంది. ఈ ప్రాజెక్టు సమీప గ్రామాల్లోని ఆర్థిక వ్యవస్థను పుంజుకునేలా చేసి, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. ఈ మార్గం నిర్మాణం కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదు, రాష్ట్రంలో పర్యాటక రంగానికి కూడా కొత్త ఊపిరి పోసే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టును 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ. 330 కోట్లతో ప్రతిపాదించినప్పటికీ.. నిధుల కేటాయింపులో జాప్యం కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం మొత్తం వ్యయం రూ. 464 కోట్లకు చేరగా.. ఈ పనులను కేంద్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో చేపట్టనుంది. రైల్వే అధికారుల అంచనా ప్రకారం రెండేళ్లలోపు ఈ పనులు పూర్తవుతాయిఎంఎంటీఎస్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి యాదాద్రికి ప్రయాణం గణనీయంగా సులభతరం అవుతుంది. కేవలం రూ. 20 టిక్కెట్‌తో సుమారు గంటలోపే యాదాద్రి ఆలయానికి చేరుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. యాదాద్రి, జనగామ జిల్లా ప్రజలు సులువుగా హైదరాబాద్‌కు చేరుకోవచ్చు. కాగా, జనగామ వరకు ఎంఎంటీఎస్ పొడిగింపునకు మరోమారు కేంద్రంతో చర్చిస్తానని ఎంపీ చామల వెల్లడించారు. ప్రస్తుతం మౌలాలి నుంచి ఘట్‌కేసర్ వరకు 21 కిలోమీటర్ల మేర కొత్తగా రెండు ఎంఎంటీఎస్ లైన్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఘట్‌కేసర్ నుంచి మరో 33 కిలోమీటర్ల మేర కొత్త లైను వేస్తే యాదాద్రి కనెక్టివిటీ పూర్తి అవుతుందని చెప్పారు.

## పోస్టాఫీసుల వద్ద మహిళలు క్యూ...

వరంగల్, జూలై 17, నేటి సమాజంలో అబద్ధపు ప్రచారాలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని, దీనివల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని ఈ కథనం వివరిస్తుంది. తెలంగాణలోని మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 పోస్టాఫీసు ఖాతా ద్వారానే జమ చేస్తారనే తప్పుడు వార్త హనుమకొండ జిల్లాలో కలకలం రేపింది. ప్రభుత్వం నుండి అధికారిక ప్రకటన రాకముందే మహిళలు పోస్టాఫీసుల వద్ద బారులు తీరారు. ఈ ప్రచారం ప్రజలను అయోమయానికి గురిచేసింది. దీనిపై పోస్టాఫీస్ అధికారిని వివరణ కోరగా ఏమన్నారో తెలుసా..నేటి సమాజంలో నిజం కంటే అబద్ధాలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా వాడకం ఎక్కువ అవ్వడం వల్ల.. ఆధారాలు లేని వార్తలు, పుకార్లు క్షణాల్లో ప్రజల్లోకి వెళ్లిపోతున్నాయి. దీనివల్ల లాభాల కంటే కూడా అనర్థాలే ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ప్రజలు వాస్తవాలను నిర్ధారించుకోకుండానే నమ్మేసి, తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. కొన్నిసార్లు ఈ ప్రచారాలు వ్యక్తుల జీవితాలపై, సామాజిక సామరస్యంపై, చివరకు ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. విశ్వసనీయత కోల్పోవడం, అనవసర భయాందోళనలు, ఆర్థిక నష్టాలు వంటివి అబద్ధ ప్రచారం వల్ల జరిగే కొన్ని ప్రధాన అనర్థాలుగా చెప్పుకోవచ్చు.ఇందుకు తాజా ఉదాహరణగా.. తెలంగాణలోని మహాలక్ష్మి పథకంకు సంబంధించి జరిగిన ఒక ప్రచారం ప్రజలను అయోమయానికి గురిచేసింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా అర్హులైన మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అయితే.. పోస్టాఫీస్‌లో ఖాతా ఉంటేనే రూ.2500 జమ చేస్తారని ఒక అవాస్తవ ప్రచారం విస్తృతంగా సాగింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినా.. ఈ పుకారు నిజమని నమ్మి, హనుమకొండ జిల్లాలోని మహిళలు గత వారం రోజుల నుంచి పోస్టాఫీసుల వద్ద భారీగా క్యూ కట్టారు.కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారెంటీలలో 'మహాలక్ష్మి పథకం' ఒకటి. దీని కింద ప్రతినెలా అర్హులైన మహిళలకు రూ.2500 ఆర్థిక సహాయం అందించాలని ప్రతిపాదించింది. ఇంకా ఈ పథకానికి సంబంధించి విధివిధానాలు ఇంకా ఖరారు కాలేదు.. రూ.2500 చెల్లింపు ప్రక్రియ ఇంకా ప్రారంభం కానప్పటికీ.. దానిపై వచ్చిన తప్పుడు ప్రచారం మహిళలను పోస్టాఫీసుల వైపు పరుగులు తీయించింది.హనుమకొండలో బాలింతలు, వృద్ధులు సైతం గంటల తరబడి ఎండలో వేచి ఉండి ఖాతాలు తీసుకున్నారు. దీనిపై తపాలా కార్యాలయ అధికారిని వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని స్పష్టం చేశారు. పోస్టాఫీసు ఖాతా సాధారణంగా అందరికీ ప్రయోజనకరమైనదే కాబట్టి.. వచ్చిన వారికి ఖాతాలు తెరుస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ఎంతో ప్రతిష్టాత్మకం అయినది.

# టీచర్ల రేషనలైజేషన్ పై గురి...

### నచ్చిన చోటికి సర్దుబాటు చేస్తే నజరానా

మహబూబ్ నగర్ జూలై 17, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే చెప్తూ వస్తున్నాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు మాత్రం విద్యార్థులకు విద్యానందించడం మిన హా మిగతా అన్ని వ్యాపారాలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని బాహాటంగా విమర్శ లు వ్యక్తం అవుతున్నాయి.రియల్ ఎస్టేట్, చి ట్టీలు, బెట్టింగ్ యాప్స్ ప్రమోట్, షేర్ మార్కెట్లలో పెట్టుబడులు, ఇతర ప్రైవేటు పాఠశా లలు కళాశాల నిర్వహణ వంటి వాటిపై శ్రద్ధ చూపుతూ వ్యాపార సామ్రాజ్యం ఏర్పాటుకు శ్రద్ధ చూపుతున్నారని చర్చ జరుగుతుంది. అందుకు పాఠశాలకు ఇలా వెళ్ళామా అలా వచ్చామా అన్నట్లుగా నివాసగృహానికి అతి చేరువలో పాఠశాల ఉండే విధంగా సర్దుబా టు ప్రక్రియను అనుకూలంగా మలుచుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.గత ప్రభు త్వంలో ఉపాధ్యాయులు విద్యార్థుల లేని పా ఠశాలలను మూసేయడంతో ఆ ప్రాంతంలో విద్యార్థులు పూర్తిగా నష్టపోతారని భావించి ఈ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి మూతబడ్డ పాఠశాలను కూడా తెరిపించింది. కాగా ఆయా పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య కు ఆధారంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాల్సి ఉంది. విద్యార్థుల సంఖ్య కనుగొనగా ఉపాధ్యాయుల సంఖ్య తగ్గినచోట ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.దీనిని ఆసరాగా చేసుకొని డుమ్మా కొట్టే పంతులు ముందు వరుసలోకొచ్చి త మకు అనుకూలమైన పాఠశాలకు సర్దుబా టు చేయాలని రాజకీయ ఉపాధ్యాయ సం ఘాల నేతల ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదునుగా భావించిన ఓ డుమ్మా టీచర్ డీఈఓ కార్యాలయాల కేంద్రంగా తప్పుడు సర్దుబాటుకు రాచ మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. అందుకు ఒక్కో సర్దుబాటుకు టీచర్ నుండి సుమారు 30 నుండి 50 వేల వరకు వసూళ్లు కూడా చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.గతంలో సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు సొంత స్థానాలకు రాకముందే మరికొంత మందిని నిబంధనలకు విరుద్ధంగా వారికి అనుకూలమైన పాఠశాలలకు సర్దుబాటు చే స్తూ ఉత్తర్వులివ్వడం చర్చకు దారితీస్తోంది. సర్దుబాటు చేసే ప్రక్రియలో జూనియర్ టీచర్లకు అవకాశం ఇవ్వాల్సి ఉండగా ప్రధానో పాధ్యాయులను పంపడం విశేషం. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, ఉపా ధ్యాయుల సంఖ్య ఆధారంగా సబ్జెక్టుల వారి గా క్రోడీకరించి సర్దుబాటు చేయాల్సి ఉన్నా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా కొంతమందిని ఇప్పటికే సర్దుబాటు చేయడంతో సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయిదీంతో అంతకుముందు పనిచేసిన పాఠశాల విద్యార్థు లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. మరి కొంతమంది ఉపాధ్యా యులు కక్కుర్తి పడి ఆరోగ్యంగా ఉన్నప్పటికీ అనారోగ్యంగా ఉన్నట్లు తప్పుడు ధృవప త్రాలు కూడా సృష్టించి సర్దుబాటుకు లైన్ క్లియర్ చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నా యి.

# బొత్స కుటుంబంలో చీలిక..

విజయనగరం, జూలై 17, బొత్స కుటుంబంలో చీలిక వచ్చిందా? ఆధిపత్య పోరు ప్రారంభం అయ్యిందా? వచ్చే ఎన్నికల్లో తలో దారిన వెళ్ళనున్నారా? విజయనగరం పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఓ నేత రాజకీయ చిరకాల ప్రత్యర్థిని ప్రశంసించడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల గోవా గవర్నర్గా సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు నియమితులైన సంగతి తెలిసిందే. ఆయన నియామకంతో టిడిపి కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. సీనియారిటీతోపాటు సిన్సియారిటీకి సరైన గౌరవం దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అశోక్ గజపతిరాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అనూహ్యంగా తన చిరకాల ప్రత్యర్థి అయిన బొత్స కుటుంబం నుంచి ఓ మాజీ ఎమ్మెల్యే అశోక్ గజపతి రాజుకు అభినందనలు తెలపడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుందివిజయనగరం జిల్లాలో) బొత్స కుటుంబానిది ఒక హవా. కాంగ్రెస్ హయాంలో పెనుమత్స సాంబశివరాజు ఒక వెలుగు వెలిగారు. ఆయన శిష్యరికంలో పనిచేశారు బొత్స. కానీ తనకున్న సామాజిక, కుటుంబ బలంతో ఒక రాష్ట్రస్థాయి నేతగా ఎదిగారు. ఉత్తరాంధ్రలో తనకంటూ ఒక మార్క్ చూపించారు. విజయనగరం జిల్లాలో అశోక్ గజపతిరాజుకు ధీటుగా రాజకీయాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు మొన్నటి వైసిపి ప్రభుత్వం లో ఒక వెలుగు వెలిగారు. తాను చీపురుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రి పదవి చేపట్టేవారు. సోదరుడు అప్పల నరసయ్య గజపతినగరం నియోజకవర్గంలో నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. మరో సమీప బంధువు బడ్డు కొండ అప్పలనాయుడు నెల్లిమర్ల శాసనసభ్యుడిగా ఉండేవారు. స్వయానా మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ చైర్మన్గా ఇప్పటికీ కొనసాగుతున్నారు. అయితే మొన్నటి ఎన్నికల్లో బొత్స తో పాటు ఆయన కుటుంబ సభ్యులంతా ఓడిపోయారు. ప్రస్తుతం బొత్స విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్నారు. పైగా శాసనమండలిలో విపక్ష నేతగా కొనసాగుతున్నారు.విజయనగరం జిల్లాలో పూసపాటి అశోక్ గజపతి రాజుతో బొత్స కుటుంబానికి దశాబ్దాలుగా వైరం నడుస్తోంది. అయితే ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు అశోక్ గజపతిరాజు. ఈ క్రమంలో అశోక్ ను గోవా గవర్నర్ గా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పుడు అశోక్ గజపతి రాజును నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆకాశానికి ఎత్తేశారు. రాజకీయాలకే వన్నెతెచ్చిన నాయకుడు అశోక్ గజపతి రాజు అని కొనియాడారు. అటువంటి నేత జిల్లా వాసి కావడం గర్వకారణంగా చెప్పుకొచ్చారు. అయితే బొత్స కుటుంబ వ్యక్తి ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థిని ప్రశంసించడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. గత కొద్దిరోజులుగా బడ్డు కొండ అప్పలనాయుడుకు బొత్స కుటుంబంతో విభేదాలు ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అప్పలనాయుడు అశోక్ గజపతి రాజును ప్రశంసించడం చర్చకు దారితీస్తోంది. రకరకాల రచ్చకు కారణం అవుతోంది.నెల్లిమర్ల ఇన్చార్జిగా బడ్డుకొండ అప్పలనాయుడు ను తప్పిస్తారని ప్రచారం నడుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన టిడిపిలో చేరుతారని కూడా టాక్ నడిచింది. నెల్లిమర్ల నియోజకవర్గంలో బొత్స సోదరుడు వేలు పెట్టడం వెనుక పెద్ద స్కెచ్ ఉందన్నది అప్పలనాయుడు లో ఉన్న అనుమానం. అయితే అప్పలనాయుడు జిల్లా పరిషత్ చైర్మన్, బొత్స మేనల్లుడు అయిన మజ్జి శ్రీనివాసరావుకు స్వయాన బావ. అయితే ఇటీవల కుటుంబంలో తలెత్తిన విభేదాలతో బడ్డుకొండ తీవ్ర మనస్తాపంతో ఉన్నట్లు ప్రచారం జరిగింది. అందుకే బొత్స ప్రత్యర్థిని ఆకాశానికి ఎత్తినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# జగన్ ఆ ప్రస్తావన తేకపోవడానికి కారణం ఏమై ఉంటుంది చెప్మా?

విజయవాడ, జూలై 17, వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు రెండు గంటల పాటు మీడియా సమావేశం పెట్టారు. అందులో అన్ని అంశాలను ప్రస్తావించారు. అన్నివర్గాల ప్రజలకు తాము అండగా ఉంటున్నామని చెప్పారు. కానీ ఒక్క విషయంలో మాత్రం ఆయన స్పందించలేదు. అదే ఇప్పుడు రాజకీయంగానూ, రాజధాని అమరావతిలోనూ హాట్ టాపిక్ గా మారింది. జగన్ మైండ్ సెట్ మారినట్లుందని సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. అనేక అంశాలను ప్రస్తావించిన జగన్ రాజధాని రైతుల విషయాన్ని మాత్రం పూర్తిగా పక్కన పెట్టేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మరో ఇరవై వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణకు నిర్ణయించిన నేపథ్యంలో జగన్ ఆ ప్రస్తావన లేకుండా సమావేశాన్ని ముగించారు. మిర్చి, పొగాకు, మామిడి రైతుల సమస్యలను ప్రస్తావించారు. కరేడు లో భూ సేకరణపై కూడా జగన్ మండిపడ్డారు. మూడు పంటలు పండే భూమిని ఎలా సేకరిస్తున్నారని ప్రశ్నించారు. కరేడు రైతులు తనను కలిశారని, వారికి అండగా వైసీపీ నిలబడుతుందని మీడియా సమావేశంలో చెప్పారు. కానీ రాజధాని రైతులు రెండో విడత భూ సమీకరణకు అంగీకరించకపోయినా వారి గురించి మాట్లాడకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాజధాని రైతుల పై ఆగ్రహంతోనే జగన్ వారికి మద్దతుగా మాట్లాడలేదా? లేక జగన్ తన మైండ్ సెట్ ను మార్చుకున్నారా? అన్న చర్చ జరుగుతుంది. అనేక సమస్యలపై పోరాటానికి సిద్ధమని ప్రకటించిన జగన్ రాజధాని భూముల ప్రస్తావన మాత్రం తేలేదు. గతంలో అసెంబ్లీ సమావేశంలోనే రాజధాని నిర్మాణానికి ముప్ఫయి వేల ఎకరాల భూములు అవసరమా? అని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు మరో ఇరవై వేల ఎకరాలు సమీకరించడానికి ప్రభుత్వం సిద్ధమయినా ఎందుకు ప్రశ్నించలేదన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తానే అంతకు ముందు అవసరమైతే మరిన్ని భూములు సేకరించాలని తాను అన్నమాటలు జగన్ కు గుర్తుకు వచ్చి ఉండవచ్చని కొందరు నెట్టింట నిలదీస్తున్నారు. అయితే ప్రభుత్వం రెండో విడత ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణ విషయంలో కొంత వెనక్కు తగ్గినట్లు ప్రచారం జరుగుతున్నా అది తాత్కాలికమేనని, ఖచ్చితంగా భూ సమీకరణ మరో ముప్ఫయి వేల ఎకరాలను సేకరిస్తామని అధికారులు చెబుతున్నారు. . గత ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ మూడు రాజధానుల అంశంతో జనం ముందుకు వెళ్లి బోల్తాపడ్డారు. మూడు రాజధానుల ప్రతిపాదనను మూడు ప్రాంతాల్లో జనం అంగీకరించలేదని 2024 ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయి. దీంతో గత కొన్నాళ్ల నుంచి మూడు రాజధానుల అంశం జగన్ నోటి వెంట నుంచి రావడం లేదు. పైగా ఇటీవల ఆయన గుంటూరు – విజయవాడను కలుపుతూ రాజధాని నిర్మాణం చేపడితే బాగుండేదని కూడా అభిప్రాయపడ్డారంటే ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లే కనపడుతుందంటున్నారు. అందుకే జగన్ రాజధాని అమరావతి విషయంలో జరిగే విషయాలను కొంతకాలం పరిశీలించిన తర్వాత మాత్రమే రెస్పాండ్ కావాలని భావిస్తున్నట్లుంది. అందుకే రెండు గంటల పాటు జరిగిన మీడియా సమావేశంలో రాజధాని అమరావతి పేరు కూడా తేకుండా జగన్ జాగ్రత్త పడ్డారంటున్నారు.వడ్డీతో చెల్లిస్తాంచంద్రబాబు నాయుడుకు, అధికారులకు వైసీపీ అధినేత వార్నింగ్ ఇచ్చారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని, వస్తే వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. జగన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం బెదిరింపులకు ఎవరూ భయపడే వారు లేరన్నారు. కేసులకు భయపడి ప్రశ్నించడం మానుకుంటామంటే అది మీ అవివేకమే అవుతుందని అన్నారు ఎన్ని కేసులు పెడితే అంత ఖచ్చితంగా ఇంకా పెద్ద గొంతుకతో ప్రశ్నిస్తూనే ఉంటామని జగన్ అన్నారు. ఇప్పుడు వేధించిన అధికారులను ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుంటామని, వారు ఎక్కడ ఉన్నా పట్టి తీసుకు వచ్చి చట్టప్రకారం శిక్షించడం ఖాయమని జగన్ అన్నారు. ఈసారివచ్చేది తమ ప్రభుత్వమేనన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకుని, న్యాయపరంగా వ్యవహరించాలని జగన్ అన్నారు. దెబ్బతిన్న వాళ్లు రేపు తన మాట వినరని, అప్పుడు పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలని, అది మీ ఊహకే వదిలేస్తున్నానని అన్నారు

# అమరావతికి మైక్రోసాఫ్ట్...

విజయవాడ, జూలై 17, ఏపీకి గుడ్ న్యూస్. మరో దిగ్గజ పరిశ్రమ ఏపీకి రానుంది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ మైక్రోసాఫ్ట్ అమరావతి క్వాంటం వ్యాలీకి వస్తోంది. ఈ మేరకు ఆ సంస్థ పసరత్తు ప్రారంభించింది. క్వాంటం కంప్యూటర్ తీసుకురానుంది. ఇందుకు సంబంధించి అధికారులతో చర్చలు కూడా జరిగాయి. త్వరలో ఏపీ ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్ మధ్య ఎంవోయూ కుదరనుంది. ఇప్పటికే ఐబీఎం 156 క్యూబిట్ల సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఐబీఎం బాటలోనే మైక్రోసాఫ్ట్ నడవనుంది. ఐబీఎం సంస్థ క్వాంటం కంప్యూటర్ కు భిన్నంగా మైక్రోసాఫ్ట్ మరో క్వాంటం కంప్యూటర్ ఉండనుంది.సాంకేతికంగా అత్యున్నతంగా క్వాంటం కంప్యూటర్లుసేవలందించునున్నాయి. వీటిలో సూపర్ కండక్టింగ్, ట్రాప్డ అయాన్, పోటానిక్, టోపో లాజికల్, న్యూట్రల్ ఆటమ్ లు ఉన్నాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీలో మైక్రోసాఫ్ట్ కొత్త భవనం కట్టనుంది. ఇది నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. అయితే ఈ భవనం మైక్రోసాఫ్ట్ కడుతుందా? ప్రభుత్వం కట్టి ఇస్తుందా అన్నది తెలియడం లేదు. ఎంవోయూ సమయంలో దీనిపై స్పష్టత రానుంది.వాస్తవానికి అమెరికాలోని మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయంలో 50 క్యూ బిట్స్ సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేసింది. అయితే క్వాంటం టెక్నాలజీ పై ఏపీ ప్రభుత్వం మొగ్గు చూపుతున్న నేపథ్యంలో అమరావతిలో పరిశోధనా కేంద్రం కోసం ఎంచుకుంది. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ హైదరాబాదులో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసుకున్న సంగతి తెలిసిందే. అమరావతి క్వాంటం వ్యాలీలో 90 లక్షల చదరపు అడుగుల సదుపాయాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 40 చదరపు అడుగులు ఐబీఎం కోసం, ఐటీ హార్డ్వేర్ తయారీ కంపెనీల కోసం ఒక భవనాన్ని నిర్మించాలని నిర్ణయించింది. అయితే ఇప్పుడు మైక్రోసాఫ్ట్ వస్తుండడంతో ప్రపంచ దిగ్గజ సంస్థల చూపు అమరావతి పై పడే అవకాశం ఉంది.ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ అమెజాన్, అయాన్ క్యు వంటి సంస్థలు క్వాంటం కంప్యూటింగ్ రంగంలో అనేక సాంకేతికలపై పరిశోధనలు చేస్తున్నాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీకి సంబంధించి అనుకూల వాతావరణం ఏర్పాటు చేయాలన్నది చంద్రబాబు టార్గెట్. తద్వారా ప్రపంచంలో క్వాంటం ద్వారా రాణించాలనుకుంటున్న దిగ్గజ సంస్థలను తన వైపు తిప్పుకోవాలన్నదే చంద్రబాబు లక్ష్యం. మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజ సంస్థ అమరావతికి వస్తే మాత్రం.. ఒక విధంగా చెప్పాలంటే అనుకూల వాతావరణం ఏర్పాటు అవుతుంది. స్వల్ప కాలంలోనే అమరావతి క్వాంటం వ్యాలీ అంతర్జాతీయ స్థాయికి ఎక్కడం ఖాయం.

# సింగరాయకొండలో కనిపించని పెద్ద భవనాలు




ఒంగోలు, జూలై 17, భారీగా సంపాదించినా..కోట్ల ఆస్తులున్నా..ఎంత గొప్పోళ్లైనా..ఎవ్వరైనా భగవంతుడి ముందు తగ్గాల్సిందే. భక్తులకు ఈ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు..కానీ ఏకంగా ఓ ఊరు ఊరంతా తగ్గుతూనే వస్తున్నారు. తరతరాలుగా ఇదే సంప్రదాయం పాటిస్తున్నారు. దేవుడిపై ఉన్న భయమో–భక్తో కానీ పూర్వకాలం నుంచి పెద్దలు అనుసరిస్తున్న కట్టుబాటుని దాటే సహసం ఎవరూ చేయడం లేదు. ఊరి పేరు పాత సింగరాయకొండ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వే స్టేషన్ కి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఊర్లో నివాసం ఉండేవారంతా బాగా స్థిరపడినవారే..అంటే ఆర్థికంగా ఓ అడుగుపైన ఉన్నవారే. కానీ ఈ ఉర్లో ఎక్కడా బహుళ అంతస్తుల భవనాలు కనిపించవు. అంతెందుకు..కనీసం ఇంటికి సెకెండ్ ఫ్లోర్ వేయరు. ఎన్ని కోట్లు మూలుగుతున్నా, ఎంత సంపాదించినా తరతరాలుగా ఇదే కట్టుబాటును అనుసరిస్తున్నారు. పాత సింగరాయకొండలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఈ స్వామివారంటే స్థానికులకు ఎంతో భక్తి. ఎంత అంటే..ఈ ఊర్లో ఉండే ఒక్క నివాసం కూడా స్వామివారి ఆలయాన్ని మించిన ఎత్తులో ఉండకూడదు. తరతరాలుగా ఇదే నియమం పాటిస్తున్నారు. ఒకప్పుడు పూరిపాకలు ఉండేవి, ఆ తర్వాత అవి పెంకుటిల్లుగా మారాయి..ఆ తర్వాత డాబాలొచ్చాయి..అంతే..అక్కడితోనే ఆగిపోయారు. మరో ఫ్లోర్ అదనంగా వేసే సాహసం మాత్రం చేయలేదు. స్వామివారి ఆలయం కన్నా ఏ ఇల్లు కూడా ఎత్తుగా కనిపించకూడదు అనే నియమానికి కట్టుబడి ఉండిపోయారు. ఒకప్పుడు అక్కడో గ్రామం ఉందని దూరంనుంచి వచ్చేవారికి తెలిపే సిగ్నల్ ఆలయం. ఆలయం ధ్వజస్తంభం, గోపురం చూసి ఇక్కడో గుడి ఉందంటే నివాసాలున్నాయని అర్థం చేసుకునేవారు బాటసారులు. పైగా ఎక్కడైనా ఆలయం ఉందంటే..ఆ చుట్టుపక్కల నివాసయోగ్యమైన స్థలంగా భావించేవారు. పండుగలు, వేడుకలు, ఒక్కోసారి పంచాయితీలు కూడా ఆలయం వేదికగానే నడిచేవి. ఇప్పటికీ పాతసింగరాయకొండలో ఇదే పద్ధతి నడుస్తోంది. ఇల్లు ఉన్నవాళ్లు మరో ఇల్లు కట్టుకుంటారు కానీ మరో ఫ్లోర్ మాత్రం వేయరు.తాతముత్తాతల నుంచి ఇదే సంప్రదాయం అనుసరిస్తున్నారు. అందుకే వాళ్లని ఫాలో అయిపోతున్నాం అంటారు స్థానికులు ఇక్కడ మొత్తం 1500 పైగా నివాసాలున్నాయి. రోడ్ దాటిన తర్వాత మరికొన్ని నివాసాలున్నాయి. వాస్తవానికి ఇది సింగరాయకొండ...కానీ ఊరి పరిధి పెరిగిన తర్వాత కొత్త సింగరాయకొండ అనడం మొదలుపెట్టారు. దీంతో ఈ ప్రదేశం పాతసింగరాయకొండగా స్థిరపడింది. ఇళ్ల సంఖ్య పెరుగుతోంది కానీ పైన మరో ఫ్లోర్ మాత్రం వేయరు అని పంచాయతీ ఆఫీసులో పనిచేసే సోము చెప్పారు. డబ్బుల్లేకకాదు.. కానీ స్వామిని మించి ఉండకూడదు అనే నియమం.ఎవరైనా ఆలయ నిర్మాణాన్ని దాటి కడితే ఆ భవనం కూలిపోతుందని అక్కడే పుట్టి అక్కడే పెరిగిన ఓ పెద్దావిడ చెప్పారు . వాస్తవానికి మూడు అంతస్తులు నిర్మించినా కొండంత ఎత్తురాదు కానీ పూర్వకాలం నుంచి ఉండిపోయిన నమ్మకం అది. భక్తో, భయమో కానీ ఈ ఊర్లో ఈ సెంటిమెంట్ బలపడిపోయిందంటారు అక్కడున్న పురోహితులు. దక్షిణ సింహాచలంగా పిలిచే ఆ ఆలయాన్ని పల్లవులు కట్టించారు...విజయనగరం చక్రర్తులు అభివృద్ధి చేశారని అక్కడున్న శాసనాల్లో ఉంది. భక్తులకు ఈ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు..కానీ ఏకంగా ఓ ఊరు ఊరంతా తగ్గుతూనే వస్తున్నారు. తరతరాలుగా ఇదే సంప్రదాయం పాటిస్తున్నారు. దేవుడిపై ఉన్న భయమో–భక్తో కానీ పూర్వకాలం నుంచి పెద్దలు అనుసరిస్తున్న కట్టుబాటుని దాటే సహసం ఎవరూ చేయడం లేదు. ఊరి పేరు పాత సింగరాయకొండ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వే స్టేషన్ కి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఊర్లో నివాసం ఉండేవారంతా బాగా స్థిరపడినవారే..అంటే ఆర్థికంగా ఓ అడుగుపైన ఉన్నవారే. కానీ ఈ ఉర్లో ఎక్కడా బహుళ అంతస్తుల భవనాలు కనిపించవు. అంతెందుకు..కనీసం ఇంటికి సెకెండ్ ఫ్లోర్ వేయరు. ఎన్ని కోట్లు మూలుగుతున్నా, ఎంత సంపాదించినా తరతరాలుగా ఇదే కట్టుబాటును అనుసరిస్తున్నారు. ఒకప్పుడు అక్కడో గ్రామం ఉందని దూరంనుంచి వచ్చేవారికి తెలిపే సిగ్నల్ ఆలయం. ఆలయం ధ్వజస్తంభం, గోపురం చూసి ఇక్కడో గుడి ఉందంటే నివాసాలున్నాయని అర్థం చేసుకునేవారు బాటసారులు. పైగా ఎక్కడైనా ఆలయం ఉందంటే..ఆ చుట్టుపక్కల నివాసయోగ్యమైన స్థలంగా భావించేవారు. పండుగలు, వేడుకలు, ఒక్కోసారి పంచాయితీలు కూడా ఆలయం వేదికగానే నడిచేవి. ఇప్పటికీ పాతసింగరాయకొండలో ఇదే పద్ధతి నడుస్తోంది. ఇల్లు ఉన్నవాళ్లు మరో ఇల్లు కట్టుకుంటారు కానీ మరో ఫ్లోర్ మాత్రం వేయరు.తాతముత్తాతల నుంచి ఇదే సంప్రదాయం అనుసరిస్తున్నారు. అందుకే వాళ్లని ఫాలో అయిపోతున్నాం అంటారు స్థానికులు పల్లవుల కాలం నుంచి ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయాన్ని విజయనగర రాజులు కూడా సందర్శించారు..దానాలు చేశారని ఇక్కడ శాసనాల్లో ఉంది. ఇక్కడ మొత్తం 1500 పైగా నివాసాలున్నాయి. రోడ్ దాటిన తర్వాత మరికొన్ని నివాసాలున్నాయి. వాస్తవానికి ఇది సింగరాయకొండ...కానీ ఊరి పరిధి పెరిగిన తర్వాత కొత్త సింగరాయకొండ అనడం మొదలుపెట్టారు. దీంతో ఈ ప్రదేశం పాతసింగరాయకొండగా స్థిరపడింది. సంఖ్య పెరుగుతోంది కానీ పైన మరో ఫ్లోర్ మాత్రం వేయరు అని పంచాయతీ ఆఫీసులో పనిచేసే సోము చెప్పారు. మొత్తానికి భక్తో–భయమో పాత సింగరాయకొండవాసులు అనుసరిస్తున్న ఈ నియమం ఇప్పటికి అయితే కొనసాగుతోంది..మరి భవిష్యత్ తరాలు కూడా అనుసరిస్తారా?...

# ఇంకా ఉందంటున్న నారాయణ

గుంటూరు, జూలై 17, అమరావతి రెండో దశ భూసమీకరణపై మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రెండో దశలో సుమారుగా 34 వేల ఎకరాల భూమిని సమీకరించాలని ప్రభుత్వం భావించింది. 13 గ్రామాల పరిధిలో ఈ భూములను సమీకరించాలని ప్రతిపాదించారు. ఇందుకోసం పలు గ్రామాలలో గ్రామసభలు కూడా నిర్వహించారు. అయితే అమరావతి రెండో దశ భూసమీకరణ ఆగిందంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వార్తలపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ క్లారిటీ ఇచ్చారు.రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని ఏపీ ప్రభుత్వం చెప్తోంది. మూడేళ్లలోగా అమరావతిలో తొలి దశ నిర్మాణాలను పూర్తి చేయాలనే పట్టుదలతో ఉంది. ఇక అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో.. అమరావతిలో ఇంటర్నేషనల్ ఎయిర్పోర్టు, స్పోర్ట్స్ సిటీ, అమరావతి క్రికెట్ స్టేడియం వంటి నిర్మాణాలను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. రాజధాని అమరావతి కోసం తొలి దశలో 33 వేల ఎకరాలు సమీకరించగా.. రాజధాని భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రెండో విడతలో మరో 34 వేల ఎకరాలు సమీకరించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అయితే రెండో విడత భూసమీకరణకు రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని.. అమరావతి రెండో దశ భూసమీకరణ ఆగిపోయిందంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.ఈ పరిణామాల నేపథ్యంలో అమరావతి రెండో దశ భూసమీకరణపై మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ క్లారిటీ ఇచ్చారు.

# చంద్రబాబు సొంత ఇలాకాలోనే ఇబ్బందులా

అమరావతి, జూలై 17, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఇప్పుడు అమరావతి రైతుల్లోనే అసంతృప్తి పెరుగుతుంది. ఇచ్చిన భూములను డెవలప్ చేయకుండా ఇంకా భూములు కావాలంటూ సమీకరణకు సిద్ధమవుతుండటాన్ని తప్పుపడుతున్నారు. నిజానికి చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అమరావతి రైతులు ధర్నాకు దిగాలని నిర్ణయించినా, అది నారా లోకేశ్ జోక్యంతో విరమించుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. అంటే రైతులు మరో విడత భూ సమీకరణకు వ్యతిరేకంగా ఉన్నారని స్పష్టంగా అర్థమవుతుంది. ముందు తీసుకున్న భూములను అభివృద్ధి చేసిన తర్వాత మిగిలిన భూములను అవసరమైతే సేకరించడంలో తప్పులేదని, అదే సమయంలో ఒక్కటీ పూర్తి చేయకుండా, రైతులకు మేలుచేయకుండా మరోసారి భూ సమీకరణ చేయడాన్ని అమరావతి రైతులే ప్రశ్నిస్తున్నారంటే చంద్రబాబుకు ఊహించని షాక్ అని చెప్పక తప్పదు. ఇందుకు ఉదాహరణలతో చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుపడుతూ సెటైర్లుపడుతున్నాయి. ఒక మెకానిక్ వద్దకు మోటారుబైక్ ను తీసుకెళి రిపేర్ చేయమంటే... దానిని బాగు చేసేలోపు మరొక బైక్ రాగానే దానికి మరమ్మతులుచేయడానికి వెళ్లినట్లుగా ఉందని సెటైర్లు వేస్తున్నారు. అంటే ముందు ఇచ్చిన బైక్ రిపేర్ కాదు. తర్వాత ఇచ్చిన బైకుకు కూడా మోక్షం కలగదు అంటూ ఎద్దేవా చేస్తున్నారు. చంద్రబాబు మరో విడత భూ సమీకరణ కూడా ఇలాగే ఉందని అంటున్నారు. అమరావతి భూ సమీకరణకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదించారు. దాదాపు రెండో విడత ఇరవై వేల ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. ఇందుకు అధికారులతో పాటు ఎమ్మెల్యేలు కూడా రంగంలోకి దిగి రైతులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తీరుపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది.. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి పరిశ్రమల ఏర్పాటు కోసం రెండోదశ భూసమీకరణ చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం కొంతకాలం వెయిట్ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. దాదాపు 20, 496 ఎకరాలు సమీకరణ కింద తీసుకోవాలని ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సిఆర్డిఏ అథారిటీ సమావేశంలో నిర్ణయించారు. దానిపై క్యాబినెట్లోనూ చర్చ జరిగింది. ఆమోదించిన సమయంలో ఎప్పుడు నోటిఫికేషన్ ఇవ్వాలనే అంశం నిర్ణయించలేదు. దీంతో పూలింగ్ ప్రక్రియను ప్రారంభించలేదు. ఇప్పటికే. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అందరి కంటే ముందుగా అమరావతి మండల పరిధిలోని గ్రామాల్లో సమీకరణ ప్రక్రియపై రైతులతో సమావేశాలు నిర్వహించారు. అప్పట్లో రైతుల్లో పెద్దగా అవగాహన లేకపోవడంతో ఎమ్మెల్యే చెప్పారనే పేరుతో తలూపినా, ఈలోపు వారందరూ గత పూలింగు ఏరియాలో ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేసిన తర్వాత భూములు ఇవ్వకూడదనే నిర్ణయానికి వచ్చారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో నోటిఫికేషన్ ను నిలిపేశారు.గతంలో సమీకరణకు ఇచ్చిన ప్రాంతంలో ప్లాట్లనే అభివృద్ధి చేయలేదనే అంశంపై రాజధాని రైతులు అసంతృప్తిగా ఉన్నారు. తమకు డెవలెప్ చేసిన ప్లాట్లు ఇస్తే వాటిని విక్రయించి తమ పిల్లల పెళ్లిళ్లు జరపుకుంటామని, పదేళ్లవుతున్నా ఇంకా అక్కడ ఎలాంటి అభివృద్ధి లేదని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.కానీ రైతులకు త్వరలోనే అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా వారికి నమ్మకం కలగడం లేదు. ప్రతి పనికీ డెడ్ లైన్ పెట్టే చంద్రబాబు నాయుడు తమకు ఇచ్చే ప్లాట్ల విషయంలో మాత్రం డెడ్ లైన్ ఎందుకు పెట్టడం లేదని రైతులు నిలదీసేపరిస్థితికి వచ్చింది. రైతులకు ఇవ్వాల్సిన కౌలును చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామాల్లో ప్రచారం చేశారు. మొత్తం మీద రెండో దశ భూసమీకరణ నిలిపేశారని అధికారులే ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. త్వరలోనే పూలింగ్ కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల తర్వాతనే ప్రక్రియ మొదలవుతుందని చెబుతున్నారు. మరి రాజధాని రైతులు ఏ మేరకుసహకరిస్తారన్నది చూడాల్సి ?ంది

# కాఫీ తాగడం మానేస్తున్నారా? ఒక్కసారిగా మీ శరీరంలో కలిగే మార్పులు ఇవే!



చాలా మందికి కాఫీ లేకుండా రోజు మొదలవుతుందని చెప్పొచ్చు. ఉదయాన్నే కాఫీ తాగడం చాలామందికి ఒక అలవాటు, కొందరికి అయితే అదొక నిత్యక్రియ. కెఫీన్ మనల్ని ఉత్సాహంగా ఉంచుతుంది, మనస్సును చురుకుగా చేస్తుంది. కాఫీ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు కొన్ని అనర్థాలూ ఉన్నాయి. కాఫీని మానేస్తే మన ఆరోగ్యంపై చాలా ప్రభావం ఉంటుంది. అయితే, కాఫీ తాగడం పూర్తిగా మానేయాలనుకుంటే మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి, కానీ దీర్ఘకాలంలో కొన్ని గణనీయమైన మార్పులు కూడా కనిపిస్తాయి. 1. శరీరంలో డిటాక్స్ ప్రక్రియ: కాఫీ తాగడం మానేయడం వల్ల కెఫిన్‌ను శరీరం పూర్తిగా వదిలించుకుంటుంది. ఇది డిటాక్స్‌కు సహాయపడుతుంది. కాఫీ అనేది సహజంగా డీహైడ్రేషన్ కారణం కావడంతో, కాఫీ మానేయడం వల్ల శరీరానికి తగినంత నీరు అందుతుంది. “ కాఫీ తాగడం వల్ల ఇన్ని నష్టాలున్నాయా..?” 2. నిద్రలో మెరుగుదల: కాఫీలోని కెఫిన్ నిద్రను ప్రభావితం చేస్తుంది. కాఫీని మానేయడం వల్ల నిద్ర గుణాత్మకంగా మెరుగవుతుంది. కాఫీ తీసుకునే వారు తరచుగా నిద్రలో ఆటంకం ఎదుర్కొంటారు. కాఫీ మానేయడం వల్ల నిద్రనక దృఢమైన స్థితి లభిస్తుంది. మరింత ప్రశాంతంగా నిద్రపోవచ్చు. 3. మానసిక ఉద్రిక్తత తగ్గడం: కాఫీ మానేయడం వల్ల కొంతమంది మానసిక శాంతిని పొందుతారు. అధిక కాఫీ సేవనం ఎంజైటీని పెంచుతుంది. కాఫీని మానేసిన తర్వాత మానసిక ఒత్తిడి తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. కొంతమందిలో కాఫీ ఆందోళనను పెంచుతుంది. కాఫీ మానేస్తే, ఆందోళన తగ్గే అవకాశం ఉంది. 4. తక్కువ గుండె స్పందన: కాఫీ తీసుకునే వారిలో గుండె స్పందన ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. కాఫీ మానేయడం వల్ల గుండె స్పందన సాధారణ స్థితికి చేరుకోవచ్చు. కొంతమందికి కాఫీ తీసుకోవడం వల్ల ఆమ్లత్వం (ఆసిడిటీ), గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు ఉంటాయి. దీనిని మానేయడం ద్వారా ఇలాంటి సమస్యలు తగ్గుతాయి. “ రాత్రిపూట టీ తాగితే ఏమౌతుందో తెలుసా..?” 5. మూడ్ స్వింగ్‌లకు ఎదురయ్యే అవకాశం: కాఫీ మానేసిన కొద్ది రోజులు మూడ్ స్వింగ్‌లు రావచ్చు. ఇది కాఫీకి అలవాటు పడిన శరీరం ఆ అలవాటు విడిచిపెట్టే ప్రక్రియలో ఉండటం వల్ల జరుగుతుంది. కాఫీ మానేసినప్పుడు శరీరం సహజంగా అలసట అనుభూతి చెందుతుంది. ఇది శరీరం కాఫీ లేకుండా సహజ స్థాయిలో ఎడ్జస్ట్ అవుతున్న సూచన. కొద్ది రోజుల్లో ఇది సాధారణ స్థితికి వస్తుంది. కాఫీ మానేయడం వల్ల మొదట్లో కొన్ని ప్రతికూలతలు ఉండవచ్చు కానీ, దీర్ఘకాలంలో శరీరానికి ఆరోగ్యకరమైన మార్పులు కనిపిస్తాయి. కాఫీని మానేయాలని అనుకునే వారు దీనిని శ్రద్ధగా, స్థిరంగా ప్లాన్ చేసుకోవడం ఉత్తమం

# పొద్దుతిరుగుడు గింజల్లో దాగున్న ఆరోగ్య రహస్యాలు!



మనకు ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చే వాటిల్లో పొద్దుతిరుగుడు గింజలకు ఒక మంచి స్థానం ఉంది. పొద్దు తిరుగుడు గింజల్లో క్యాలరీలు, ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్లు, మినరల్స్, ఆరోగ్యకరమైన కొవ్వు, పిండి పదార్థాలు, ఫైబర్ ఉంటాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ ఈ పుష్కలంగా ఉంటుంది. ఇది మన శరీరంలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ గా పనిచేస్తుంది. శరీరంలో ఫ్రీ రాడికల్స్ వల్ల వచ్చే నష్టాలనుండి మన శరీరాన్ని కాపాడుతుంది. పొద్దు తిరుగుడు గింజలతో గుండె ఆరోగ్యం పొద్దుతిరుగుడు విత్తనాలలో బి విటమిన్ సమృద్ధిగా ఉంటుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో థయామిన్, రిబోఫ్లావీన్, నియాసిన్ ఉంటాయి. ఇవి మన శరీరాన్ని అనేక విధాలుగా రక్షిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలు ముఖ్యంగా మన గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రక్తనాళాలలో ఉండే చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మన గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో పొద్దుతిరుగుడు గింజలు కీలక భూమిక పోషిస్తాయి. “హబీనిబప్తతినివ ఎతిబిజీఎతిని: సన్‌షైన్ విటమిన్ గురించి మీకు తెలుసా..? ఎప్పుడు, ఎలా లభిస్తుందంటే..” పొద్దు తిరుగుడు గింజలతో యవ్వనంగా పొద్దుతిరుగుడు గింజల్లో విటమిన్ ఈ పుష్కలంగా ఉండడం వల్ల ఇది మన శరీరంలో కోల్పోతున్న కొలాజిన్ ఉత్పత్తికి దోహదం చేసి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పొద్దుతిరుగుడు గింజలను నిత్యం తీసుకుంటే చర్మం నిగారింపు సంతరించుకుంటుంది. పొద్దుతిరుగుడు గింజల్లో ఉండే ప్రోటీన్, ఫైబర్ కారణంగా మన కడుపు నిండుగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. ఇది మనను అతిగా తినడం నుండి నివారిస్తుంది. ఫలితంగా మనం ఆరోగ్యకరంగా బరువు తగ్గే అవకాశం కలుగుతుంది. పొద్దు తిరుగుడు గింజలతో ఎముకల ధృడత్వం పొద్దుతిరుగుడు గింజలలో ఉండే విటమిన్ ఈ తోపాటు, యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా మన కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది మనల్ని ఒత్తిడి నుంచి కాపాడుతుంది. పొద్దుతిరుగుడు గింజల్లో మెగ్నీషియం, కాల్షియం, మరియు కాపర్ పుష్కలంగా ఉండడం వల్ల ఇది ఎముకల బలాన్ని పెంచుతుంది. ఎముకలు ధృఢంగా ఉండేలా చేస్తుంది. జీర్ణ వ్యవస్థకు, డయాబెటిస్ కంట్రోల్ కు బెస్ట్ ఫుడ్ పొద్దు తిరుగుడు గింజల్లో ఉండే ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ కారణంగా మన మెదడు పనితీరు మెరుగుపడుతుంది. ఇది మన బ్రెయిన్ ఫంక్షన్ కు ఎంతగానో దోహదం చేస్తుంది. పొద్దుతిరుగుడు గింజల్లో ఉండే డైటరీ ఫైబర్ కారణంగా మన జీర్ణ క్రియ మెరుగుపడుతుంది. మన జీర్ణ వ్యవస్థకు ఇది ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఇవి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తాయి. “పొట్లకాయ తిన్న తర్వాత తినకూడని ఆహారాలు.. పొరపాటున తిన్నారో..?” పొద్దు తిరుగుడు గింజలతో ఈ సమస్యలకు చెక్ పొద్దుతిరుగుడు గింజలలో ఉండే పోషకాలు పురుషుల పునరుత్పత్తి ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. ఇక మహిళలలో కూడా మూడ్ స్వింగ్స్, రుతుక్రమ సమస్యలను తగ్గించడంలో దోహదం చేస్తాయి. పొద్దుతిరుగుడు గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్రీ రాడికల్స్ మనల్ని క్యాన్సర్ నుండి కాపాడతాయి. మన జుట్టు ఆరోగ్యాన్ని కూడా పొద్దు తిరుగుడు గింజలు మెరుగుపరుస్తాయి. అయితే పొద్దుతిరుగుడు గింజలను ఎక్కువ మోతాదులో తినడం మంచిది కాదు. దీనివల్ల అనేక ఇబ్బందులు రావచ్చు.

# సన్‌షైన్ విటమిన్ గురించి మీకు తెలుసా..? ఎప్పుడు, ఎలా లభిస్తుందంటే..

శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో విటమిన్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. రోగనిరోధక శక్తిని అందించడంతో పాటు శరీర పనితీరుకు మద్దతిస్తాయి. మనకు పలు రకాల విటమిన్లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా విటమిన్లను శరీరంలోకి పంపిచవచ్చు. అయితే విటమిన్ ఆ ఇతర వాటికి కొంత భిన్నంగా ఉంటుంది. విటమిన్ ఆ ని సన్‌షైన్ విటమిన్ గా కూడా పిలుస్తారు. శక్తివంతమైన ఎముకలు, రోగనిరోధక వ్యవస్థ మద్దతుతో పాటు శరీర సమగ్ర ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ ముఖ్యమైన పోషక పదార్థం కాల్షియం మరియు ఫాస్ఫరస్‌ను శరీరం గ్రహించడంలో సహాయపడుతుంది. ఇవి ఎముకల ఆరోగ్యం మరియు కండరాల పనితీరు కోసం అత్యంత అవసరమైనవి. “చలి




పెరుగుతోంది.. చర్మాన్ని పొడిబారకుండా రక్షించుకోండిలా!” సూర్యకాంతి విటమిన్ ఆకి సహజ మూలం. శరీరానికి సూర్యరశ్మికి తగిలినప్పుడు చర్మం ద్వారా విటమిన్ ఆ ఉత్పత్తి అవుతుంది. చర్మం రకం మరియు భౌగోళిక ప్రదేశం ఆధారంగా వారానికి కొన్ని సార్లు 10-30 నిమిషాల పాటు శరీరం సూర్యకాంతిని సంగ్రహించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. విటమిన్ ఆ తగినంత స్థాయిలో ఉంటేనే ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే రోగ నిరోధక వ్యవస్థను కూడా పూర్తిగా పనిచేయగలుగుతుంది. అయితే ఎప్పుడు పడితే అప్పుడు ఎండలో నిలబడటం వల్ల ఉపయోగం ఉండదు సరికదా చర్మం అనారోగ్యం పాలవుతుంది. ఉదయం లేదా సాయంత్రం వేళ జు౦ కిరణాల ప్రభావం తక్కువగా ఉన్న సమయం మంచిదిగా భావించవచ్చు. ఉదయం 8 లోపు లేదా సాయంత్రం 4 తర్వాత సూర్య కాంతి శరీరానికి తగిలేలా ఎండలో గడపవచ్చు. దీంతో దాన్ని శరీరం గ్రహించి విటమిన్ ఆని తయారు చేసుకుంటుంది. అలా తయారు చేసుకున్న విటమిన్‌ను పలు అవసరాలకు ఉపయోగించుకుంటుంది. రేణూదేశాయ్ చేసిన మంచిపని.! పవన్ కళ్యాణ్ కు మరాఠీ నేర్పిన మాజీ భార్య.! ।ానివతినిటతిజీ ఎవశ్రీబీణబీ అంతేకాకుండా పలు ఆహార పదార్థాల్లో కూడా విటమిన్ ఆ సమృద్ధిగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సాల్మన్ మరియు ట్యూనా వంటి కొవ్వు కలిగిన చేపలు, కోడ్ లివర్ ఆయిల్‌లో ఈ విటమిన్ ఎక్కువగా ఉంటుంది. వీటితో పాటు పాలు, నారింజ రసం, మరియు సీరియల్స్ వంటి ఫోర్టిఫైడ్ ఆహారాలు కూడా విటమిన్ ఆను శరీరానికి అందిస్తాయి. ముఖ్యంగా తగినంత సూర్యరశ్మి లభించని వారికి ఇవి సహాయపడతాయి.

# ఖాళీ కడుపుతో ఈ ఒక్కజ్యూస్ తాగితే చాలు.. ఫ్యాట్ మొత్తం కరిగిపోవాల్సిందే!




గోధుమ గడ్డి జ్యూస్‌ను ఆరోగ్యానికి మేలునిచ్చే “సూపర్ ఫుడ్”గా భావిస్తారు. ఎందుకంటే ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ జ్యూస్ పలు పోషకాలతో నిండి ఉండటమే కాకుండా, శరీరాన్ని శక్తివంతంగా శుభ్రపరచే సహజ మార్గాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఖాళీ కడుపుతో గోధుమ గడ్డి జ్యూస్ తాగడం వల్ల ఆరోగ్యానికి అనేక లాభాలు కలుగుతాయి. 1. డీటాక్సిఫికేషన్‌లో సహాయపడుతుంది గోధుమ గడ్డి జ్యూస్ అద్భుతమైన డీటాక్సిఫైయింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది లివర్‌ను శుభ్రం చేయడంలో సహాయపడుతుంది, శరీరంలో నిల్వైన హానికరమైన టాక్సిన్లను తొలగిస్తుంది. దీని వలన శరీర శుద్ధి ప్రాసెస్ వేగవంతం అవుతుంది. గోధుమ గడ్డి జ్యూస్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది ప్రత్యేకంగా డయాబెటిక్ పేషంట్లకు మేలైన ఆహారంగా భావించబడుతుంది. “కాఫీ తాగడం మానేస్తున్నారా? ఒక్కసారిగా మీ శరీరంలో కలిగే మార్పులు ఇవే!” 2. రక్తం శుభ్రపరుస్తుంది గోధుమ గడ్డి జ్యూస్‌లో అధిక శాతం కలిగిన రక్తాన్ని శుభ్రం చేస్తుంది. ఇది రక్తంలో ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరుస్తుంది, అందువల్ల రక్త ప్రవాహం మెరుగవుతుంది. మానసిక ఉల్లాసాన్ని మెరుగుపరచడంలో మరియు ఆందోళన, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే పోషకాలు మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. 3. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది ఈ జ్యూస్ ప్రోబయాటిక్స్ సమృద్ధిగా కలిగి ఉండి జీర్ణశక్తిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది పొట్టలో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాను పెంచి, ఆమ్లజనక సమస్యలు, గ్యాస్, మరియు కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. 4. రోగనిరోధక శక్తిని పెంచుతుంది గోధుమ గడ్డి జ్యూస్ యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంది. ఇవి శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను తక్కువ చేసి, ఇన్ఫెక్షన్లకు ఎదుర్కొనే శక్తిని పెంచుతాయి. రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. “కాకరకాయతో కలిపి ఈ ఆహారాలు అస్సలు తినొద్దు.. ఎంత డేంజరంటే?” 5. చర్మ ఆరోగ్యం కోసం గోధుమ గడ్డి జ్యూస్‌లో ఉండే పౌష్టికాలు చర్మానికి ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఇది చర్మం మెరిసిపోవడానికి సహాయపడుతుంది. పింపుల్స్, మచ్చలు, మరియు ఇతర చర్మ సమస్యలను తగ్గిస్తుంది. జుట్టు రాలడాన్ని నిరోధిస్తుంది. 6. బరువు తగ్గడంలో సహాయపడుతుంది గోధుమ గడ్డి జ్యూస్ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో తాగడం వల్ల ఇది మెటబాలిజం వేగాన్ని పెంచుతుంది, శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది, అదే సమయంలో ఫ్యాట్‌ను తొలగిస్తుంది. గోధుమ గడ్డి జ్యూస్‌లో కేలరీలు తక్కువగా ఉంటాయి మరియు ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది ఆకలిని తగ్గించి బరువు తగ్గడానికి సహాయపడుతుంది. తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఖాళీ కడుపుతో గోధుమ గడ్డి జ్యూస్ తాగడం వల్ల కొంతమందికి వికారం, వాంతులు వంటి అనారోగ్యాలు కలగవచ్చు. కనుక ప్రారంభంలో కొద్దిగా జ్యూస్ తీసుకోవాలి, ఒకేసారి అధిక పరిమాణం తీసుకోవడం మంచిది కాదు. శుద్ధమైన గోధుమ గడ్డి మాత్రమే ఉపయోగించాలి. గర్భిణీ మహిళలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డాక్టరు సలహా తీసుకోవాలి.

# చలి పెరుగుతోంది.. చర్మాన్ని పొడిబారకుండా రక్షించుకోండిలా!

నవంబర్ మాసం పూర్తయి డిసెంబర్ మాసం కూడా వస్తోంది. ఇక చలి ఇప్పటికే చంపేస్తుంది. ముందు ముందు డిసెంబర్, జనవరి నెలలలో విపరీతంగా చలి ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే శీతాకాలం కారణంగా చర్మం పొడి బారటం ప్రధానంగా కనిపిస్తుంది. శీతాకాలంలో చర్మం పొడిబారకుండా ఉండేందుకు ఖచ్చితంగా తగిన జాగ్రత్తలను తీసుకోవాలి .మన వంటింటి చిట్కాలతోనే మన చర్మాన్ని కాపాడుకోవచ్చు. అవేమిటో ప్రస్తుతం మనం తెలుసుకుందాం. చలికాలం చర్మ సంరక్షణా చిట్కాలు శీతాకాలంలో చర్మం పొడిబారి బారకుండా ఉండేందుకు కొబ్బరి నూనెను ఉపయోగించడం మంచిది. కొబ్బరి నూనె పొడిబారిన చర్మానికి కావలసిన తేమను అందించి చర్మం సాఫ్ట్ గా ఉండేలా చేస్తుంది. కొబ్బరి నూనెలో ఉండే ఫ్యాటీ యాసిడ్ చర్మానికి మెరుపును ఇస్తుంది. ఇక శీతాకాలంలో చర్మ సౌందర్యం కోసం, చర్మం తేమగా మృదువుగా ఉండడం కోసం పాలను ఉపయోగిస్తే మంచిది. పాలలో దూది నానబెట్టి ముఖంపైన అద్దితే చర్మం తాజాగా కనిపిస్తుంది. “శరీరంలో యూరిక్ యాసిడ్ పెంచే కూరగాయలు.. ఎక్కువ తిన్నారో..?” ఇంట్లో ఉండే వీటితో చర్మానికి నిగారింపు ఇక శీతాకాలంలో చర్మం పొడిబారి పగిలిపోయి అసహ్యంగా కనిపించకుండా తేనెను అప్లై చేయడం కూడా ఎంతో మంచిది. పొడిబారిన చర్మంలో తేమదనాన్ని సంతరించుకునేలా తేనె బాగా పనిచేస్తుంది. తేనెను ఒక పల్చని పొరలా చర్మంపై అప్లై చేయడం వల్ల మన చర్మం సున్నితత్వాన్ని, నిగారింపును సొంతం చేసుకుంటుంది. శీతాకాలంలో చర్మం తేమ కోసం ఇలా చెయ్యండి ఇక శీతాకాలంలో చర్మాన్ని కాపాడుకునేందుకు కీరదోస చాలా బాగా పనిచేస్తుంది. కీరదోస చర్మాన్ని చల్లగా ఉంచడమే కాకుండా, చర్మం లో తేమని పెంచి ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. చాలామంది శీతాకాలంలో చల్లగా ఉండడం వల్ల ఎక్కువగా నీరు తాగరు. దీనివల్ల శరీరం డి హైడ్రేడ్ అయ్యి చర్మం పొడి బారుతుంది. చర్మాన్ని తేమగా ఉంచడానికి ప్రతిరోజు తగినంత నీటిని తప్పనిసరిగా తాగాలి. 5 5 అలోవెరా జెల్, పెట్రోలియం జెల్లీలతో చర్మం నిగారింపు ఇక శీతాకాలంలో పొడి చర్మం వల్ల కలిగే ఇబ్బందుల నుండి అలోవెరా జెల్ ఉపశమనాన్ని ఇస్తుంది. అలోవెరా జెల్ చర్మాన్ని సహజంగా తేమతో ఉంచి పొడిబారడం నుండి కాపాడుతుంది. శీతాకాలంలో పెట్రోలియం జెల్లీ కూడా చర్మం పొడిబారకుండా రక్షణ నిస్తుంది. ఇక శీతాకాలంలో చర్మం పొడిబారకుండా నిగారింపును సొంతం చేసుకోవాలంటే పైన పేర్కొన్న చిట్కాలను ట్రై చేసి చూడండి.







# ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ పౌరాణిక చిత్రం

## ఆసక్తికర విషయాలు వెల్లడించిన నాగవంశీ



యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినీ కెరీర్‌లో దూసుకుపోతున్నాడు. గతేడాది దేవర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తారక్ మరికొన్ని రోజుల్లో వార్ 2 చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాతో బాలీవుడ్ మార్కెట్‌లోనూ తన సత్తా చాటనున్నాడు. హృతిక్ రోషన్‌తో కలిసి చేస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ఆగష్టు 15న విడుదల కానుండగా, అభిమానులు సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇదే కాకుండా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్-టైనర్ ఒకటి చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా.. దీనికోసం ఎన్టీఆర్ బరువు కూడా చాలా తగ్గాడు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ శ్రీనివాస్ ఒక సినిమా చేయబోతున్నట్లు- వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. మైథాలాజికల్ మూవీగా రానున్న ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించబోతున్నాడు. సుబ్రహ్మణ్య స్వామి కథ ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్ విషయాల గురించి పంచుకున్నాడు నాగవంశీ. త్రివిక్రమ్ మొదటిసారి మైథలాజికల్ సినిమా చేస్తున్నారు. అందుకే ఈ సినిమాను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మధ్యలో ఈ సినిమా లాంఛింగ్‌తో పాటు శరవేగంగా షూటింగ్ ఉంటుంది. త్రివిక్రమ్- వెంకటేశ్ సినిమా ఆగస్టు నుంచి ఈ సినిమా ప్రారంభం అవుతుంది. ఇది పూర్తయిన తర్వాతే ఎన్టీఆర్ ప్రాజెక్ట్ మొదలవుతుందని తెలిపాడు. త్రివిక్రమ్- ఎన్టీఆర్ సినిమా ప్రకటించడానికి భారీ స్థాయిలో ప్లాన్ చేశాం. త్రివిక్రమ్ మొదటిసారి మైథలాజికల్ సినిమా తీస్తున్నారు. సీనియర్ ఎన్టీఆర్‌ను రాముడిగా, కృష్ణుడిగా చూశాం. ఇప్పుడు తారక్‌ను నేను అలా చూపించనున్నాను. 'రామాయణ'ను ప్రకటించిన తర్వాత దేశమంతా దాని గురించి మాట్లాడుకుంది. దానికంటే భారీగా మా సినిమాను ప్రకటించాలని కొన్ని రోజులు ఆపాం. ఇప్పుడు ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మధ్యలో దీన్ని ప్రారంభించాలని అనుకుంటున్నాం. త్రివిక్రమ్- వెంకటేశ్ సినిమా ఆగస్టు నుంచి ప్రారంభం అవుతుంది. ఇది పూర్తయిన తర్వాత దీని పనులు మొదలవుతాయని నాగవంశీ చెప్పారు. ఇక విజయ్ దేవరకొండను ప్రేక్షకులు ఎందుకు టార్గెట్ చేస్తారో కూడా తెలియదని నాగవంశీ అన్నారు. ఆయన ప్రస్తుతం తన సినిమాలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేకపోతున్నాయని బాధ పడుతున్నట్లు- చెప్పారు. ఆయన ఏం మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అన్నారు.



# హరిహరవీరమల్లు పార్-2 మరింత పవర్‌ఫుల్

## ప్రమోషన్లలో పాల్గొంటున్న నిధి అగర్వాల్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా రూపొందిన చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రం 'హరి హర వీరమల్లు'జులై 24న గ్రాండ్ రిలీజ్ కానుంది. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో పవన్ అంత యాక్టివ్‌గా పాల్గొనడం లేదు. దర్శకుడు క్రిష్ మిడ్‌స్టేజ్‌లో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్న నేపథ్యంలో ఆయన కూడా ప్రమోషన్ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. జ్యోతికృష్ణ ప్రస్తుతం ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా ఉన్నప్పటికీ తెలుగు ప్రేక్షకుల్లో ఆయనకు గుర్తింపు తక్కువగా ఉండడంతో పెద్దగా బజ్ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మొత్తం ప్రమోషన్ బరువు బాధ్యతలు నిధి అగర్వాల్ భుజాలపై పడింది. పంచమి పాత్రలో మెప్పిస్తున్న నిధి, గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ సినిమాపై భారీ నమ్మకంతో ఎదురుచూస్తోంది. ఈ సినిమాతో ఆమె రేంజ్ మారుతుందని ఫ్యాన్స్ కూడా భావిస్తున్నారు. ఇక సినిమాకి సంబంధించిన ప్రతి ప్రమోషన్ కార్యక్రమంలో నిధి యాక్టివ్‌గా పాల్గొంటుంది. తాజాగా ఓ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి అగర్వాల్, 'హరి హర వీరమల్లు'తో పాటు- పార్ట్ 2 గురించి కూడా కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించింది. మొదట సినిమాను ఒకే పార్ట్‌గా రూపొందించాలనుకున్నప్పటికీ, కథ విస్తృతంగా ఉండటంతో రెండు భాగాలుగా చేయాలని నిర్ణయించారని తెలిపింది. ఇప్పటికే పార్ట్ 2కి సంబంధించిన 20 నిమిషాల సీన్స్ షూట్ పూర్తయ్యాయని చెప్పి అభిమానులని ఆనందింపజేసింది. నిధి చెప్పిన ప్రకారం, వీరమల్లు పార్ట్ 2లో కూడా ఆమె కీలక పాత్రలో కనిపించనుంది. అలాగే, రెండో భాగం మరింత పవర్‌ఫుల్‌గా ఉంటుందని తెలియజేసింది. అయితే షూటింగ్ మిగతా భాగం ఎప్పుడవుతుందనేది మాత్రం ఇంకా స్పష్టత లేదు. పవన్ రాజకీయాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో పార్ట్ 1 హిట్ అయితేనే పార్ట్ 2పై క్లారిటీ- వచ్చే అవకాశం ఉంది.ఏఎం రత్నం నిర్మాణంలో, క్రిష్ మరియు జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.



# రామాయణ బడ్జెట్ నాలువేల కోట్లు

## సంచలన వివరాలు వెల్లడించిన నిర్మాత




బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారీ రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. తాజాగా దీని బడ్జెట్‌ను నిర్మాత నమిత్ మల్హోత్రా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఏకంగా రూ.4000 కోట్లతో దీన్ని నిర్మించనున్నట్లు- చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఇప్పటివరకూ ఇంత భారీ బడ్జెట్‌తో భారతీయ సినిమాలు తెరకెక్కలేదన్న నమిత్ 'రామాయణ' చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉందన్నారు. మేం ఈ సినిమా కోసం నిధులు సమకూర్చుకుంటున్నాం. ఎవరి దగ్గరా డబ్బులు తీసుకోవాలని అనుకోవడం లేదు. ఏడు సంవత్సరాల క్రితమే మేం దీని పనులు ప్రారంభించాం. కొవిడ్ తర్వాత దీన్ని ప్రారంభించినప్పుడు ప్రజలు నన్ను పిచ్చివాడిని అనుకున్నారు. ఏ భారతీయ సినిమా కూడా 'రామాయణ' దరిదాపుల్లోకి రాలేదు. రెండు భాగాలు రానున్న ఈ చిత్రాన్ని సుమారు రూ.4000 కోట్లతో రూపొందించనున్నాం. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే దీన్ని భారీ స్థాయిలో రూపొందిస్తున్నాం. హాలీవుడ్ చిత్రాలకు అయ్యే ఖర్చు కంటే ఇది తక్కువే అని నేను భావిస్తున్నాను. తరాలు మారినా, యుగాలు మారినా రామాయణం ఎప్పటికీ గొప్ప ఇతిహాసమే అని నిర్మాత తెలిపారు. భారతీయ సినిమాపై ప్రపంచం చిన్నచూపు చూసినప్పుడు తాను నిరాశకు గురవుతానన్నారు నమిత్ మల్హోత్రా. 'రామాయణ' ప్రాజెక్ట్‌తో ప్రపంచమంతా భారత్ వైపు చూస్తుందన్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా బడ్జెట్‌పై ఎన్నో ఊహాగానాలు వచ్చాయి. రూ.835 కోట్లతో రానుందని టాక్ వినిపించింది. తర్వాత రూ.1600 కోట్లని.. మొదటిభాగం రూ.900 కోట్లతో రానుందని.. రెండోది రూ.700 కోట్లని కథనాలు వెలువడ్డాయి. ఇప్పుడు వాటన్నిటికీ చెక్ పెడుతూ నిర్మాతే అధికారికంగా దీని బడ్జెట్‌ను రివీల్ చేయడం వైరల్‌గా మారింది. ఇక ఇందులో ఈ చిత్రంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్న విషయం తెలిసిందే.

# చిత్ర పరిశ్రమపై సెటైరికల్ మూవీ ఫంకీ




విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఫంకీ' సినిమా గురించి కీలక విషయాలను వెల్లడించారు నిర్మాత నాగవంశీ. ఈ సినిమా చిత్ర పరిశ్రమపై సెటైరికల్‌గా తెరకెక్కుతుందని ఇందులో విశ్వక్ దర్శకుడి పాత్రలో కనిపించబోతున్నారని విశ్వక్ తెలిపాడు. జాతిరత్నాలు, ప్రిన్స్ వంటి కామెడీ సినిమాలను తెరకెక్కించిన కేవీ అనుదీప్ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాలో తమిళ నటి కాయదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా.. ప్రస్తుతం ఆమె డేట్స్ కోసం ఎదురుచూస్తున్నామని నాగవంశీ తెలిపాడు. ఫంకీలో ఇప్పటివరకు వచ్చిన అవుట్‌పుట్ చాలా బాగా వచ్చిందని నాగవంశీ అన్నారు. ఈ సినిమా విశ్వక్ సేన్ కెరీర్‌కు, అలాగే దర్శకుడు కేవీ అనుదీప్‌కు చాలా ముఖ్యమైన చిత్రంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# కుబేరనుంచి శంకరా సాంగ్ విడుదల

జూన్‌లో బాక్సాఫీసు ముందుకొచ్చి, ప్రేక్షకాదరణ పొందిన సినిమాల్లో 'కుబేర' ఒకటి. నాగార్జున , ధనుష్ , రష్మిక ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ఈ నెల 18 నుంచి ఓటీటీ- 'అమెజాన్ ప్రైమ్ వీడియో' లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో.. చిత్ర బృందం ఆడియన్స్‌కు సర్‌ప్రైజ్‌లు ఇస్తోంది. ఈ సినిమాలోని సాంగ్స్ ఫుల్ వీడియోలను రిలీజ్ చేస్తోంది. 'నాది నాది నాదే ఈ లోకమంతా' వీడియో సోమవారం విడుదల కాగా.. 'శంకరా' వీడియో సాంగ్ మంగళవారం విడుదలైంది.



## నేడు జాతీయ న్యాయ దినోత్సవం



భారతదేశంలో జాతీయ న్యాయ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 26 న జరుపుకుంటారు. 1979 లో నాటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రతి సంవత్సరం నవంబర్ 26 న నేషనల్ లా డే నిర్వహించాలని ప్రకటించారు . 1949లో భారత రాజ్యాంగ కమిటి రాజ్యాంగ ముసాయిదాను చేపట్టింది. కమిటీ సభ్యులు 1949 నవంబరు 26 వ తేదీన తొలి ముసాయిదా ప్రతులపై సంతకాలు చేశారు. అది 1950 జనవరి 26 వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ మౌలిక లక్ష్యం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరికీ అందించడం, కాబట్టి రాజ్యాంగ ముసాయిదా ప్రతుల తొలి సంతకాల రోజైన నవంబరు 26 తేదిని జాతీయ న్యాయదినోత్సవముగా ఎంచుకున్నారు. ఈ దినోత్సవము నాడు న్యాయవాదులు సమావేశమై న్యాయాన్ని కాపాడుతామని న్యాయ ప్రతిజ్ఞ చేస్తారు

## పడిపోతున్న ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్

హైదరాబాద్, నవంబర్ 25, ఒకవైపు చల్లటి గాలులతో పాటు వాయు కాలుష్యం కూడా నగరాల్లో విపరీతంగా పెరిగిపోతుంది. హైదరాబాద్ కూడా డేంజర్ బెల్స్ మోగిస్తుంది. ఢిల్లీతో సమానంగా హైదరాబాద్ లో కూడా వాయు కాలుష్యం పెరిగిపోతుంది. ఇలాగే కొనసాగితే హైదరాబాద్ కూడా ఢిల్లీకి అతి త్వరగా చేరువయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. హైదరాబాద్ లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోయాయి. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాంక్రీట్ జంగిల్ గా మారిన నగరంలో అనేక కారణాలు వాయు కాలుష్యానికి కారణాలుగా అధికారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే వ్యాధుల బారిన పడతారని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తట్టుకోలేకపోతున్న తెలంగాణ జనం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్... హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా వాయు కాలుష్యం పెరిగిపోయింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోయాయి. ప్రధానంగా కూకట్ పల్లి, మూసాపేట, బాలానగర్, నాంపల్లి, మొహిదీపట్నంలో ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం చేరుకుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రయాణించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వీలయితే మాస్క్ లను ధరించడం ఉత్తమమని చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పాటు ఒక్కసారిగా వాయు కాలుష్యం పెరిగిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న వారు బయటకు వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు ఈ ప్రాంతాల్లో హైదరాబాద్ నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మూడు వందలకు క్రాస్ అయిందని చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరింత కాలుష్యం పెరిగే అవకాశముందని హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఢిల్లీతో సమానంగా వాయు కాలుష్యం నమోదవుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కాలుష్య నియంత్రణ మండలి హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యం పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రధానంగా వయో వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులున్నవారు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## అందుబాటులోకి క్యూ ఆర్ కోడ్

హైదరాబాద్, నవంబర్ 25ప్రయాణికులు, వినియోగదారులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. నగదు సమస్యను పరిష్కరించడానికి క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని తీసుకొచ్చింది. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని 6 డివిజన్లలో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పేమెంట్ సులభం అవుతుందని అధికారులు చెబుతున్నారు.నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి, డిజిటల్ చెల్లింపులను పెంచడానికి, దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. జోన్‌లోని ఆరు డివిజన్‌లలో ఉన్న రైల్వే స్టేషన్‌లలోని 35 ప్రధాన పార్శిల్ కార్యాలయాలలో 'క్యూఆర్ కోడ్' సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. సికింద్రాబాద్ డివిజన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, వరంగల్, బీదర్, కాజీపేట, లింగంపల్లి, హైదరాబాద్ డివిజన్‌లోని కాచిగూడ, నిజామాబాద్, విజయవాడ డివిజన్‌లో విజయవాడ, రాజమండ్రి, ఏలూరు, సామర్లకోట, గుడివాడ, తెనాలి, గూడూరు, కాకినాడ టౌన్, కాకినాడ పోర్టు, మచిలీపట్నం, నర్సాపూర్, గుంతకల్ డివిజన్‌లోని కడప, అనంతపురం, రాయచూర్, ధర్మవరం, తిరుపతి, గుంతకల్, రేణిగుంట, ధోనే, చిత్తూరు, నంద్యాల, గుంటూరు డివిజన్‌లో ఈ సౌకర్యాన్ని ప్రవేశపెట్టిందిసికింద్రాబాద్ డివిజన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, వరంగల్, బీదర్, కాజీపేట, లింగంపల్లి, హైదరాబాద్ డివిజన్‌లోని కాచిగూడ, నిజామాబాద్, విజయవాడ డివిజన్‌లో విజయవాడ, రాజమండ్రి, ఏలూరు, సామర్లకోట, గుడివాడ, తెనాలి, గూడూరు, కాకినాడ టౌన్, కాకినాడ పోర్టు, మచిలీపట్నం, నర్సాపూర్, గుంతకల్ డివిజన్‌లోని కడప, అనంతపురం, రాయచూర్, ధర్మవరం, తిరుపతి, గుంతకల్, రేణిగుంట, ధోనే, చిత్తూరు, నంద్యాల, గుంటూరు డివిజన్‌లో ఈ సౌకర్యాన్ని ప్రవేశపెట్టింది. ఈ సదుపాయం పార్సెల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై ప్రభావం చూపుతుందని అధికారులు భావిస్తున్నారు. క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను పార్శిల్ కార్యాలయాల వద్ద ఇన్‌స్టాల్ చేసినట్టు వెల్లడించారు.

# నేడు భారత రాజ్యాంగం దినోత్సవం




### -భారత రాజ్యంగం వర్థిల్లాలి

సుదీర్ఘకాలం పరాయి పాలనలో మగ్గిన దేశం భారతదేశం. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ ఫలితాలతో 1947 ఆగస్టు 15న స్వతంత్ర భారత్‌గా అవతరించింది. ఆ తర్వాత ప్రతి స్వతంత్ర దేశానికి ఒక రాజ్యాంగం వుండాలి. రాజ్యాంగం అంటే దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి కరదీపిక వంటిది. ఆ దీపస్తంభపు వెలుగుల్లో సర్వసత్తాక సౌర్వభౌమాధికార దేశంగా ప్రగతి వైపు అడుగులు వేయాలి. అందుకనే రాజ్యాంగానికి ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో అంతటి విశిష్టమైన స్థానముంది. కోట్లాదిమంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన దేశం కంటే ముందు అనేకదేశాలు రాజ్యాంగాలను రచించాయి. అయితే భారత రాజ్యాంగ రచన ఒక సంక్లిష్టం. దీనికి కారణం... దేశంలో అనేక మతాలు, తెగలు, ఆదీవాసీలు, దళితులు, అణగారిన, పీడనకుగురైన వర్గాలు... తదితరులున్నారు. వీరి ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగ రచన ఒక సవాల్‌లాంటిదే. ఈ నేపథ్యంలో భారత మొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ నేతృత్వంలోని రాజ్యాంగ సభ డా.బాబాసాహెబ్ అంబేద్కర్ సారథిగా డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటైంది. రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ భిన్నత్వ సమ్మేళితమైన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఎంతగానో శ్రమించారు. రాజ్యాంగమంటే కేవలం ప్రభుత్వ విధివిధానాలు, శాసనసభల రూపకల్పనే కాదు కోట్లాది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింభించాలన్నది ఆయన ప్రధానాశయం. ఆయన కృషి ఫలితంగానే ప్రపంచంలోనే కొత్తదైన రాజ్యాంగం రూపుదిద్దుకుంది. అందుకనే ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాల కంటే భారతరాజ్యాంగం ఉన్నతవిలువలు కలిగిందంటూ మన్ననలు పొందింది. భారత రాజ్యాంగానికి 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదం తెలిపింది. 2015లో అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా నవంబర్ 26న ఏటా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మన దేశంలో ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. 1949లో ఇదే రోజున భారత రాజ్యాంగానికి రాజ్యాంగ సభ ఆమోదం తెలిపింది. తర్వాత 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. నవంబర్ 26ను నేషనల్ లా డే లేదా సంవిధాన్ దివస్‌గానూ పిలుస్తారు. నేటికి భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 74 ఏళ్లు పూర్తవుతుంది. ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవాలని నవంబర్ 19, 2015న భారత ప్రభుత్వం ప్రకటించింది. ముంబైలో అంబేద్కర్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఈ ప్రకటన చేశారు. 2015లో అంబేద్కర్ 125వ జయంతి వేడుకలను నిర్వహించారు. అంబేద్కర్‌కు నివాళిగా రాజ్యాంగ దినోత్సవం జరుపుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. రాజ్యాంగ దినోత్సవం పబ్లిక్ హాలిడే కాదు. కానీ ప్రభుత్వం విభాగాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

# పాదయాత్రల ట్రెండింగ్ పోయి,...

### అరెస్ట్ ల ట్రెండింగ్...

హైదరాబాద్, నవంబర్ 25,ఒకప్పుడు పాద యాత్ర చేసిన నేతలు సీఎం అవుతారు అన్న సెంటిమెంట్ ఉండేది. రెండు దశాబ్దాలుగా.. అరెస్టు అయితే సీఎం అవుతారు అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది నిరూపితమవుతోంది.రాజకీయాల్లో ఉన్న ఏ పార్టీ అయినా అధికారంలోకి రావాలనుకుంటుంది. ఇందు కోసం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుంది. ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతాయి. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇవ్వడం ద్వారా, మేనిఫెస్టో ప్రకటించడం ద్వారా ప్రజలు పార్టీలను గెలిపిస్తారు. అయితే 2004 నుంచి ట్రెండ్ మారింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాదయాత్ర చేశారు. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యారు. దీంతో పాదయాత్ర సెంటిమెంట్‌గా మారింది. 2009లోనూ మరోమారు కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. ఇక 2013 జగన్ కూడా పాదయాత్ర చేశారు. కానీ విభజిత ఏపీకి సీఎం కాలేదు. అయితే తర్వాత జగన్ అరెస్ట్ అయ్యారు. దీంతో 2019లో ఏపీలో భారీ మెజారిటీతో వైసీపీని గెలిపించారు. జగన్ సీఎం అయ్యారు. అప్పటి నుంచి అరెస్ట్ అయిన నేతలు సీఎం అవుతారు అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 20015లో తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం నాడు టీడీపీ నేతగా ఉన్న రేవంత్‌రెడ్డిని అరెస్టుచేయించింది. తర్వాత రాజకీయ పరిణామాలతో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయన 2023లో సీఎం అయ్యారు. ఇక 2023లో ఏపీ సీఎం జగన్ చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారు. స్కిరల్ కేసులో 50 రోజులు జైల్లో పెట్టారు. దీంతో 2024లో జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించింది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు.

సోరెన్‌కు కలిసి వచ్చిన అరెస్ట్..

తాజాగా జార్ఖండ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ జేఎంఎం ఆధ్వర్యంలోని కూటమి విజయం సాధించింది. ఇందుకు మనీ ల్యాండరింగ్ కేసులో ఆయనను ఈడీ అరెస్టు చేయడమే కారణమని భావిస్తున్నారు. 2024, జనవరి 31న ఈడీ హేమంత్ సోరేన్‌ను అరెస్టు చేసింది. జూన్‌లో ఆయనకు బెయిల్ వచ్చింది. ఆరు నెలలపాటు ఆయన జైల్లో ఉన్నారు. ఈ సమయంలో చంపైన్ సోరేన్ తాత్కాలిక సీఎంగా ఉన్నారు. హేమంత్ సోరెన్ బెయిల్‌పై బయటకు వచ్చాక మళ్లీ సీఎం బాధ్యతలు చేపట్టారు. ఆయన సారథ్యంలోనే జేఎంఎం ఎన్నికలకు వెళ్లింది. 2019 ఎన్నికల్లో సొంతంగా అధికారంలోకి వచ్చిన జేఎంఎం.. ఈసారి కూటమిగా అధికారంలోకి వచ్చింది. దీంతో అరెస్టు కావడం ద్వారానే జేఎంఎం విజయానికి కారణం అన్న విశ్లేషణ జరుగుతోంది.

ఢిల్లీలో ఆప్ అధికారంలోకి వచ్చేనా..?

అరెస్టు అయిన నేతలు మళ్లీ సీఎం అవుతున్న సెంటిమెంట్ నేపథ్యంలో 2025, ఫిబ్రవరిలో జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందా అన్న చర్చ కూడా జరుగుతోంది. కేజ్రీవాల్‌ను మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్టు చేసింది. సుమారు రెండు నెలలు జైల్లో ఉన్నారు. జైల్లో ఉన్న సమయంలో సీఎంగా కొనసాగిన కేజ్రీవాల్.. బయటకు వచ్చాక రాజీనామా చేశారు. అతిషికి సీఎం పగ్గాలు అప్పగించారు. ఇప్పుడు వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతన్నారు. 11 మందితో తొలి జాబితాను ప్రకటించారు. ఇప్పటికే ఆప్‌ను మూడుసార్లు గెలిపించిన ఢిల్లీ ప్రజలు ఈసారి ఎవరికి పట్టం కడతారో చూడాలి. అరెస్టు సెంటిమెంట్ అరవింద్ కేజ్రీవాల్‌కు కలిసి వస్తుందో లేదో ఫిబ్రవరిలో తేలిపోతుంది.

# టీపీసీసీకి మహిళా అధ్యక్షురాలు...?

హైదరాబాద్, నవంబర్ 25,తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎవరనే చర్చ మొదలైంది. ప్రస్తుతం ఉన్న ప్రెసిడెంట్ తానే కొనసాగేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటే.. కొత్తవాళు తమ ప్రయత్నాలను కూడా స్పీడప్ చేశారు. నాకు ఏదో ఒక పదవి ఇచ్చాకే, కొత్త వాళ్ళను పెట్టాలంటూ పేచీ పెడుతోందట ప్రస్తుత ప్రెసిడెంట్.ప్రస్తుతం మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ సునీతరావు పదవీకాలం ముగిసి ఐదు నెలలు అయింది. కొత్త ప్రెసిడెంట్ నియమకానికి పార్టీ కూడా కసరత్తు చేస్తుంది. కొత్త చీఫ్ నియమించటానికి పార్టీ చేసిన కసరత్తు స్పీడ్ అప్ అయింది. అయితే దీనికి బ్రేకులు వేసే పనిలో ప్రస్తుత అధ్యక్షురాలు సునీతరావు ఉన్నారట. దేశంలోనే ఎక్కువ సభ్యత్వం చేశా పార్టీ కోసం ఎన్నో ఉద్యమాలు చేశా.. 80 కి పైగా తనపై కేసులు ఉన్నాయంటూ జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వద్ద మొరపెట్టుకున్నారట సునీతరావు. కొత్త అధ్యక్షురాలు నియామకం చేపడితే మహిళా కాంగ్రెస్ కోసం తాను చేసిన కృషిని పరిగణలోకి తీసుకుని నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలని ఒత్తిడి పెంచుతుందట. ఇటు పార్టీ అటు ప్రభుత్వంలో ఉన్న పెద్దల ముందు డిమాండ్ పెట్టారట.అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం నుంచి సునీతారావు పోటీ చేసి ఓడిపోయారు. అప్పట్లో అనుబంధ సంఘం అధ్యక్షులు ఎవరికి కూడా టికెట్లు ఇవ్వలేదు. కేవలం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావుకి టికెట్ ఇచ్చింది పార్టీ. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనుబంధ సంఘాల చైర్మన్ లందరికీ కార్పొరేషన్ చైర్మన్ పదవులను కట్టబెట్టింది. అయితే సునీత రావు పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో అనుబంధ సంఘాల చైర్మన్లను కార్పోరేషన్ పదవులు ఇచ్చిన నేపథ్యంలో తనకు కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారట. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చిన వారికి ఇప్పుడు వెంటనే కార్పొరేషన్ పదవులు ఇచ్చే అవకాశం లేదని పార్టీ అధిష్టానం స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సునీతరావు కొంత నారాజులో ఉన్నారట.కొత్త అధ్యక్షురాలి నియమకంపై పార్టీ పెద్దలు కసరత్తు మొదలుపెట్టారు. దీంట్లో సామాజిక సమీకరణాలను కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం అధ్యక్షురాలుగా ఉన్న సునీతారావును మార్చాల్సి వస్తే, బీసీ సామాజిక వర్గానికి చెందిన మరో మహిళని అధ్యక్షురాలు చేయాలనేది పార్టీ ఆలోచనగా కనబడుతుంది. ఏఐసిసి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళనే అధ్యక్షురాలుగా పెట్టాలని నిర్ణయం తీసుకుందట.హై కమాండ్ మరో సామాజిక వర్గానికి చెందిన మహిళా నాయకురాలు పేరు కూడా పరిశీలిస్తోందట. అవసరం వస్తే.. ఓసీకి పదవి ఇవ్వాల్సి వస్తే.. అనే కోణంలో పార్టీ పెద్దలు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ బీసీ.. మరో ఓసీ నాయకురాలి పేర్లను పరిశీలిస్తోందట పార్టీ. బీసీ సామాజిక వర్గానికి చెందిన గద్వాల మాజీ జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య తోపాటు, ఓసి సామాజిక వర్గానికి సంబంధించి బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నరసింహారెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే సరితా తిరుపతయ్యకు సీఎం రేవంత్ మద్దతు కూడా ఉన్నట్లు పార్టీ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన సరిత తిరుపతతయ్యకే దాదాపుగా మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఖాయమైనట్టు ప్రచారం జరుగుతుంది .ఇదంతా ఒక ఎత్తు అయితే సునీతరావుకు ఏదో ఒక పదవి కన్ఫర్మ్ అయ్యాకనే కొత్త మహిళా అధ్యక్షురాలి పదవి ఇవ్వాలనే ఒత్తిడి పెంచుతున్నారట. పార్టీ మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇచ్చిన వారికి తిరిగి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకుంది. కాబట్టి ప్రస్తుత అధ్యక్షురాలు సునీతరావు ఏఐసిసి వరకు తనకేదో పదవి ఇచ్చేంతవరకు కొత్త చీఫ్ ని పెట్టొద్దంటూ ఒత్తిడి పెంచుతున్నారట. మొత్తం వ్యవహారంలో హై కమాండ్ ఏం చేస్తుంది. రాష్ట్ర నాయకత్వం ఎలాంటి పరిష్కారం చూపబోతుంది అనేది చూడాలి..!

## చివరిదశకు కుటుంబసర్వే

హైదరాబాద్, నవంబర్ 25, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తుది దశకు చేరింది. మరోవైపు శనివారం నుంచి వివరాల కంప్యూటరీకరణ కూడా షురూ అయింది. ఈ నెలఖారులోపు ఈ ప్రక్రియను కూడా పూర్తి చేసే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తుది దశకు చేరింది. చాలా జిల్లాల్లో సర్వే ప్రక్రియ పూర్తి కాగా? మరికొన్నిచోట్ల 90 శాతం దాటింది. ఇప్పటి వరకు కోటికిపైగా నివాసాల్లో సర్వే పూర్తి అయింది. మరో పది శాతం ఇళ్లల్లో సర్వే పూర్తి అయితే వంద శాతం చేరుకుంటుంది.ఓవైపు సర్వేలో భాగంగా వివరాల సేకరణ ప్రక్రియ పూర్తి కావటంతో మరోవైపు డేటా ఎంట్రీపై అధికారులు దృష్టి పెట్టారు. పలు జిల్లాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం నుంచి వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నారు. ఎంపీడీవోతో పాటు పలు కార్యాలయాల్లో ప్రత్యేకంగా డేటాను ఎంట్రీ చేస్తున్నారు. నవంబర్ 30వ తేదీలోపు డేటా ఎంట్రీ పని పూర్తి అయ్యే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారంలోపు ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.మొత్తం 33 జిల్లాల్లో దాదాపు ఎనిమిది నుంచి 9 జిల్లాల్లో సర్వే పూర్తి కావొచ్చింది. ములుగు, జనగాం, వరంగల్ జిల్లాల్లో వంద శాతం వరకు చేరుకుంది. ఈ జిల్లాల్లో డేటా ఎంట్రీ పనులు ప్రారంభమయ్యాయి. మెదక్ జిల్లాల్లో 99.9 శాతం, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, గద్వాలలో 99 శాతం సర్వే పూర్తి కావొచ్చింది.సర్వే ప్రక్రియ, డేటా ఎంట్రీపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు.మొత్తం 33 జిల్లాల్లో దాదాపు ఎనిమిది జిల్లాల్లో సర్వే పూర్తయినట్టు సమాచారం. ములుగు, జనగాం జిల్లాల్లో వందకు వంద శాతం పూర్తి కాగా నల్గొండ, మెదక్ జిల్లాల్లో 99.9 శాతం, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, గద్వాలలో 99 శాతం సర్వే పూర్తయినట్టు తెలుస్తోందికామారెడ్డి జిల్లాలో 98.5 శాతం పూర్తికాగా.. మంచిర్యాల, ఆసిఫాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో 98 శాతం సర్వే పూర్తి చేసినట్టు సమాచారం. జన సాంద్రత ఎక్కువగా ఉండటంతో.. గ్రేటర్ హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో సర్వే కాస్త నెమ్మదిగా సాగుతోందని అధికారులు చెప్తున్నారు. వేరే ప్రాంతాల్లో నివాసముంటున్న వారు, తాళాలు వేసి ఉన్న ఇండ్లను మినహాయిస్తే.. మిగిలిన అన్ని కుటుంబాల సర్వే వంద శాతం పూర్తయిందని అధికారులు చెప్తున్నారు.మొదట్లో ఎన్నో అనుమానాలు, అపోహాలు.. వ్యక్తమైనప్పటికీ కుల గణనతోనే సామాజిక సాధికారత, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల అభ్యున్నతికి సర్వే ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రభుత్వ పెద్దలకు ప్రజలకు వివరిస్తుండటంతో.. అన్ని వర్గాల నుంచి సానుకూలత వ్యక్తమవుతోంది. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు.. వివిధ దశల్లో దాదాపు లక్ష మందికి పైగా ఉద్యోగులు ఈ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాలుపంచుకుంటున్నారు.రాష్ట్రంలో మొత్తం 1,16,14,349 కుటుంబాలు ఉన్నట్లుగా సర్కార్ గుర్తించింది. నవంబర్ 06 నుంచి 08వ తేదీ వరకు ఇండ్ల గణన చేపట్టగా.. నవంబర్ 9వ తేదీ నుంచి అసలు కుల గణన సర్వేను సర్కార్ ప్రారంభించింది. మొత్తం1,16,14,349 కుటుంబాల్లో గ్రామీణ ప్రాంతాల్లో 64,41,183 కుటుంబాలుండగా.. పట్టణ ప్రాంతాల్లో 51,73,166 కుటుంబాలు ఉన్నాయని సర్వేలో లెక్క తేలింది. ఈ సర్వే కోసం మొత్తం 87,807 మంది ఎన్యుమరేటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో 47,561, పట్టణ ప్రాంతాల్లో 40,246 మంది విధుల్లో ఉన్నారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించటంతో పాటు ప్రతి పది మంది ఎన్యుమరేటర్లకు ఒక పర్యవేక్షకుడిని నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,788 మంది సూపరింటెండెంట్లు సర్వేలో పాల్గొంటున్నారు

## మళ్లీ పెరిగిన రియల్ వ్యాపారం

హైదరాబాద్, నవంబర్ 25,హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుంది. గడచిన ఆరు నెలల్లో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్ బలమైన వృద్ధిని కనబరిచిందని స్థిరాస్తి కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. అక్టోబర్‌లో హైదరాబాద్ లో స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు 20 శాతం పెరిగాయని, రియల్ ఎస్టేట్ మార్కెట్ కార్యకలాపాలలో చెప్పుకోదగ్గ పెరుగుదలను కనిపించిందని ఈ సంస్థ సర్వే రిపోర్టు తెలిపింది. అక్టోబర్ నెలలో మొత్తం 5,985 రెసిడెన్షియల్ యూనిట్లు విక్రయించారు. రూ. 3,617 కోట్ల గృహాల అమ్మకాలు జరిగాయని సర్వే తెలిపింది. హైదరాబాద్ నగరంలో నివాస ప్రాపర్టీ లావాదేవీలలో ఏడాదికి 14 శాతం పెరుగుదల నమోదు అవుతున్నట్లు నైట్ ఫ్రాంక్ సంస్థ తెలిపింది.ఆగస్టు, సెప్టెంబరులో రియల్ ఎస్టేట్ అమ్మకాలు క్షీణించాయని, అయితే అక్టోబర్ బలమైన రికవరీ సాధించినట్లు నైట్ ఫ్రాంక్ సంస్థ తెలిపింది. ఆగస్టులో 27 శాతం, సెప్టెంబరులో 24 శాతం రియల్ ఎస్టేట్ విక్రయాలు క్షీణించాయి. అక్టోబర్‌లో 20 శాతం స్థిరాస్తి మార్కెట్ పుంజుకున్నట్లు సర్వేలో స్పష్టమైంది.అక్టోబర్ నెలలో రంగారెడ్డి 43 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి 41 శాతం, హైదరాబాద్ 16 శాతం ఆస్తి రిజిస్ట్రేషన్లు జరిగాయని నైట్ ఫ్రాంక్ సంస్థ తెలిపింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఇండ్ల విక్రయాలు బలంగా ఉన్నాయి. 59 శాతం గృహాలు రూ. 50 లక్షల కంటే తక్కువ ధరకు విక్రయించారు. అలాగే ప్రీమియం ఇళ్ల కొనుగోలుపై వినియోగదారుల ఆసక్తి పెరుగుతున్నట్లు నివేదిక పేర్కొంది. అలాగే రూ. 1 కోటి కంటే ఎక్కువ ధర ఉన్న ఆస్తుల విక్రయాలు గత ఏడాదితో పోలిస్తే 36 శాతం పెరిగాయి. దీంతో పాటు పెద్ద ఇళ్లకు అంటే 2 వేల చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం ఇండ్లకు డిమాండ్ పెరిగిందని ఈ సంస్థ తెలిపింది. వీటి రిజిస్ట్రేషన్లలో 12 శాతం పెరిగిందని పేర్కొంది. ఇది గత సంవత్సరంలో 11 శాతంగా ఉందని వెల్లడించింది.హైదరాబాద్‌లో రెసిడెన్సియల్ ప్రాపర్టీల సగటు ధర కూడా అక్టోబర్‌లో 7 శాతం పెరిగింది. సంగారెడ్డిలో 13 శాతం పెరుగుదలలో నమోదైంది. ఆగస్టు నెలలో హైదరాబాద్ లో 6439 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటి విలువ రూ.4043 కోట్లు. గతేడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్లు 17 శాతం పెరిగాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 8 నెలల్లో 54,483 ఇండ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని నైట్ ఫ్రాంక్ నివేదిక పేర్కొంది.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ



అనంతపురం(విజయ సారథి):అనంతపురం నగరంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ చేతుల మీదుగా జిల్లాలోని వివిధ గ్రామాలు, మండలాల్లో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు సకల వనజ, జోగి జయమ్మ, ఎన్.మహమ్మద్ గౌస్, తలారి మణికంఠ, కీర్తిశేషులు బేధడాలా నారాయణ రెడ్డి (బి.శ్రీరామ్ రెడ్డి) మరియు ఎక్కలూరి మమతకి ముఖ్యమంత్రి సహాయనిధి కింద 10,06,316 రూపాయలకు సంబంధించిన చెక్కలను ఎంపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆరోగ్యం బాగోలేక, అనేక రకాలుగా మానసికంగా, ఆర్థికపరంగా ఇబ్బంది పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సహాయం అందిస్తానని చెప్పి, ఈరోజు క్యాంప్ కార్యాలయంలో చెక్కులను అందజేశామని తెలిపారు. మాకు మరియు మా కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకున్న ప్రభుత్వానికి, పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం



తిరుపతి(విజయ సారథి):తిరుపతి రూరల్ మండలం పాడిపేట, ముండ్లపూడి గ్రామపంచాయతీల కొరకై ఏర్పాటు చేసిన సచివాలయ భవనం కట్టడం పూర్తి చేసి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్న ఇంతవరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు.ఇలాంటి భవనాలు తిరుపతి రూరల్ మండలంలో మరెన్నో పంచాయతీలలో కూడా పదుల సంఖ్యలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఘనంగా నిర్మించిన భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.కనీసం ఇకనైనా స్థానిక ప్రజా ప్రతినిధులు,ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి సచివాలయ సిబ్బందిని ఈ భవనాల్లోకి మార్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు

## వృద్ధురాలకు ఆశ్రమం కల్పించిన స్వచ్ఛంద సంస్థ

మదనపల్లి(విజయ సారథి): మదనపల్లిలోని కృష్ణా నగర్ ఫోర్త్ క్లాస్ నందు గుర్తుతెలియని వృద్ధురాలు ఉందని 100 ఫోన్ చేయగా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పిసి 3876 ఎస్ కే రియాజ్ భాషా,వారి బృందం అక్కడకు వెళ్లి ఆమెను విచారించగా ఆమెకు మాటలు రావని ఎక్కడికి పోవాలో తెలియదని సైగ చేయగా ఆమెను చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆనంద వృద్ధాశ్రమ కు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందం ఆధ్వర్యంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రెటరీ ఏ కవితా రాణి కి అప్పగించారు. ఈ సందర్భంగా కవిత రాణి మాట్లాడుతూ ఈ వృద్ధురాలు ఆచూకీ ఎవరికైనా తెలిసిన యెడల9133006333, 9441169202, 7032646910 నెంబర్లకు ఫోన్ చేయవలసిందిగా మదనపల్లి పుర ప్రజలను కోరారు. అంతవరకు ఆమె యొక్క అలనా పాలన చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ లోని ఆనంద వృద్ధాశ్రమం వారు బాధ్యత వహిస్తారని తెలియజేశారు.




# ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంపొందించాలి

కడప(విజయ సారథి):ప్రభుత్వ సేవలపై ప్రజాస్పందనల సంతృప్తి స్థాయిని పెంపొందించే విధంగా పురోగతి సాధించాలని ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ అన్ని శాఖల జిల్లా అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో.. పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక కాలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ అదితిసింగ్ హాజరయ్యారు. వీసీ ద్వారా..రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీరో పావర్టీ,ఖ4 పాలసీ,బంగారుకుటుంబాలు,మార్గదర్శులు,గ్రామ సభలు,జనాభా నిర్వహణ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. సర్క్యులర్ ఎకానమీ క్లస్టర్స్ కార్యక్రమంలో జాప్యం లేకుండా పనులని పూర్తి చేయాలన్నారు.నియోజకవర్గాల వారిగా ఎం ఎస్ ఎం ఈ పార్కుల స్థల పరిశీలన, స్టోన్ ఫౌండేషన్ వంటి తదితర అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ సర్వీసులు,చెత్త సేకరణ, ఆర్టీసి సర్వీసులు,రేషన్ పంపిణీ,దీపం 2.0 వంటి ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ పథకాలు సేవలపై ఐ వి ఆర్ ఎస్, ద్వారా ప్రజల నుంచి సేకరిస్తున్న ప్రజాస్పందనపై ఆయా జిల్లాల వారిగా సమీక్షలు చేసి పాజిటివ్ పర్సెప్షన్ పెంచాలన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంలో పెండింగ్ లేకుండా చూడాలన్నారు. స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రతి నెల మూడో శనివారం నో ప్లాస్టిక్ క్యాంపెయిన్ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. వీసి అనంతరం ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ మాట్లాడుతూ...జిల్లాలో ప్రభుత్వ సేవలు సంతృప్త స్థాయిలో ప్రజలకు అందేలా అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు.ప్రభుత్వ పథకాలు సేవలు అందించడంలో ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బద్వేల్ నియోజకవర్గం లో ఎంఎస్ఎం ఈ ని పార్కు స్టోన్ ఫౌండేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతతో అమలు చేస్తున్న జీరో పావర్టీ, పి4 పాలసీ, బంగారుకుటుంబాలు, మార్గదర్శులు గ్రామ

ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ ప్రభుత్వ పథకాలు సేవల ప్రజా స్పందనలు వంటి వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, కావేటి విజయానంద్ వీసీ ద్వారా సమీక్షించారు.



సభలు,జనాభా నిర్వహణ వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా జిల్లాలో మిగిలిన వున్న గ్రామాలను కవర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీవో హజరతయ్య, పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి,ఆర్టీసీ ఆర్ పీ. గోపాల్ రెడ్డి,జెడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం,సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి,జిల్లా రిజిస్ట్రార్ పివిఎన్ బాబు,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చక్ర బాబోయ్ వద్దు....

కర్నూలు(విజయ సారథి):కర్నూలు జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రిల దోపిడీ మితిమీరి పోయింది అనడానికి ఒక ఉదాహరణ గురువారం జరిగిన సంఘటన. నగరంలోని శ్రీ చక్ర హాస్పిటల్ లో అనారోగ్యంతో చేరిన రోగి అర్థాంతరంగా మరణించడంపై ఆసుపత్రి పై రోగి యొక్క బంధువులు దాడి చేయడం జరిగింది. పామిడి గ్రామానికి చెందిన మహిళకు అనారోగ్యం కారణంగా బుధవారం రాత్రి శ్రీ చక్ర హాస్పిటల్ లో చేర్పించడం జరిగింది. అక్కడి వైద్యులు వైద్యం చేసి ఇంటికి వెళ్ళమని సూచించడంతో వారు ఇంటికి వెళ్ళగా సాయంత్రానికి మరల అనారోగ్యంతో బాధపడుచుండగా మరల ఆసుపత్రిలో చేర్పించడానికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించిందని,ఆసుపత్రిలో చేర్చుకొనడానికి నిరాకరించడంతో బంధువులు కాళ్ళ వేళ్ళ పడి రోగిని ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. ఆసుపత్రిలోకి కూడా అనుమతించకుండా మరణించిన మహిళను కనీసం హాస్పటల్ గదిలోనికి అనుమతించకుండా బయటే ఉంచారని అంతకు ముందు రోజు వైద్యం అందించిన డాక్టర్లు రోగిపై నిర్లక్ష్యంగా వ్యవహరించి సరైన వైద్యం అందించక పోవడంతో మహిళ మరణించిందని వారు అందించిన వైద్యం కారణంగానే ఆమె మరణానికి గురైందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ నగరంలో ప్రైవేటు ఆసుపత్రుల దందా విపరీతంగా పెరిగింది పేద, ధనిక తేడా లేకుండా అందరిని దోపిడీ చేయడంలో ఆసుపత్రి యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఒకప్పుడు వైద్యం నారాయనో హరి అనే ఒక విలువైన పదం ఉండేది ఇప్పుడు వైద్యుడు ఆర్థికంగా అందరిని దోపిడీ చేయడానికి ఒక దోపిడీదారుగా అవతారం ఎత్తడం బాధాకరమైన విషయం. అనారోగ్యం కారణంగా, ప్రమాదాల ఎంతో ఇబ్బందులకు గురై అప్పు చేసి ఆస్పత్రులకు వచ్చిన వారిని వైద్యులు లాభాల పేరుతో నానాక పరీక్షలు రాసి వాటిపైనే కాకుండా అనవసరమైన మందులు రాసి రోగులపై పెనుబారం మోపుతున్నారని ఆసుపత్రి ప్రారంభించిన అతి కొద్ది రోజులకే కోట్ల రూపాయలు సంపాదించి నగరంలో ధనికుల జాబితాలో చేరుతున్నారని ప్రజలు అంటున్నారు. మరి ముఖ్యంగా నగరంలోని శ్రీ చక్ర ఆసుపత్రిలో రోగికి సరైన వైద్యం అందించక కేవలం లాభార్జనే ధ్యేయంగా దందా నడుపుతున్నారని, రోగులు, వారి సహకారుల పట్ల మర్యాద ఇవ్వకుండా యాజమాన్యం భయానక వాతావరణము సృష్టిస్తున్నారని, ఒకరకంగా చెప్పాలంటే శ్రీ చక్ర హాస్పిటల్ కి వెళితే ఈ లోకాన్ని విడిచి పెట్టినట్టే అని బంధువులు ఆరోపించారు. శ్రీ చక్ర హాస్పిటల్ ప్రారంభించినప్పటి నుండి సక్సెస్ స్టోరీస్ కంటే మరణ రేటు ఎక్కువగా ఉందని నగర ప్రజలు అభిప్రాయం వెలిబుచ్చారు ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు సదరు ఆసుపత్రి పై చర్యలు తీసుకొని వైద్యం కోసం వచ్చే వారిని కాపాడాలని వారు కోరారు.




# గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

.విశాఖపట్నం(విజయ సారథి):జిల్లాలో పేద ,బలహీనవర్గాల కోసం నిర్మిస్తున్న గృహ నిర్మాణాల ప్రగతి వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు .గురువారం ఆయన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చేపడుతున్న పేదల గృహాల స్టేజ్ కన్వర్షన్ ,మౌలిక సదుపాయాల కల్పన ,గృహ నిర్మాణాల ప్రగతిపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో హౌసింగ్,గ్రామీణ నీటిసరఫరా జి.వి.యం.సి, విద్యుత్ ,పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష చేసారు.ఈ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామ సచివాలయాలలో రాబోయే వారంలో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఈ గ్రామ సభలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏమినిటీస్ సెక్రటరీ, హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్స్పెక్టర్లు హాజరు కావాలన్నారు.ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించనీ వారికి ఇళ్లు నిర్మాణం చేపట్టే విధంగా అవగాహన కల్పించాలని, ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే ఇచ్చిన ఇళ్ల పట్టా లతో పాటు మంజూరైన ఇళ్లు రద్దు చేయడం జరుగుతుందనే సందేశం లబ్ధిదారులకు చేరాలన్నారు.సభజరిగిన ఒక వారంలో ఇంటి నిర్మాణాలకి లబ్ధిదారులు ముందుకు రాకపోతే నోటిసులు జారీ చేసి ఇళ్లు రద్దు చేయాలన్నారు.లేఅవుట్ లలో గృహ నిర్మాణాలు పూర్తి అయిన చోట విద్యుత్ ,త్రాగునీరు వంటి మౌలిక వనరులు కల్పించాలన్నారు .నిర్మాణం పూర్తి అయ్యే దశలో ఉన్న లే అవుట్ లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.రాబోయే ఒక సంవత్సరం లో జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ లేఅవుట్ లలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పేదల గృహ నిర్మాణంలో అధికారులు నాణ్యతపై దృష్టి పెట్టాలని, నాణ్యత విషయం లో రాజీ పడవద్దని అన్నారు. నాణ్యత లోపిస్తే గృహ నిర్మాణ శాఖ అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందని అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశములో కలెక్టర్ నియోజక వర్గాలు, మండలాల వారిగా లే అవుట్ ల పై కలెక్టరు సమీక్ష చేశారు. గృహ నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ సమావేశములో హౌసింగ్ పి.డి సత్తిబాబు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ ఇ కృష్ణా రెడ్డి ,ఎపిఈపిడిసిఎల్ యస్.ఇ శ్యామ్ బాబు, జి వి యం సి .ఎస్. ఇ .రవి, హౌసింగ్ ఇ ఇ లు, డి ఇ లు పాల్గొన్నారు.



## నవోదయ విద్యాలయను సందర్శించిన జిల్లా కలెక్టర్



కొమ్మాది(విజయ సారథి):జవహర్ నవోదయ విద్యాలయను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ గురువారం ఉదయం సందర్శించారు. విద్యాలయ మేనేజ్ మెంట్ కమిటీ మీటింగ్ కు అధ్యక్షత వహించి, విద్యాలయ పనితీరును, ఫలితాలను, గత సంవత్సరం నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ డా.వై.ఎస్.ఎస్.చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాలయలో జరుగుతున్న కార్యక్రమాలను విపులంగా వివరించారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులను సందర్శించి, విద్యార్థుల నోట్ బుక్స్ పరిశీలించి వారితో మాట్లాడారు. మైగ్రేషన్ విధానంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గుణ జిల్లా నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తరగతి గదిలో ప్రత్యేకంగా అమర్చిన డిజిటల్ స్మార్ట్ బోర్డులను పరిశీలించారు.జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగదీశ్వరరావు, విశాఖ వ్యాలి ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధి ఎన్. శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

## మంత్రాలయంలో మూల బృందావనానికి పూజలు

మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి అర్చకులు గురువారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో మొదలుకొని నిర్మాల్యం క్షీరాభిషేకం ఫల పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలు బంగారు కవచాలు పట్టు వస్త్రాలతో అలంకరించారు. నైవేద్యాలు సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. మృతిక బృందావనాన్ని బంగారు పల్లకిలో ఉంచి ఊరేగించారు. అంతకుముందు మఠం దివాన్ పాదపూజ చేశారు. రాత్రి శ్రీ మఠం ప్రాంగణంలో వివిధ రకాల రథోత్సవ సేవలు నిర్వహించారు. ముందుగా రథోత్సవ సేవలు చేయించినటువంటి భక్తుల పేరు గోత్రనామాలతో సామూహిక సంకల్పాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి ప్రహ్లాద దేవుడిని చెక్క బంగారు వెండి నవరత్న రథోత్సవాల్లో ఉంచి పీఠాధిపతి మంగళ హారతులు ఇచ్చారు. అశేష జనవాహిని నడుమ రాఘవేంద్ర స్వామి నామస్మరణతో మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం సహాయ మేనేజర్ ఐపీ నరసింహామూర్తి, సహాయ పీఆర్ఓ వ్యాసరాజస్వామి, తంబి స్వామి తదితరులు పాల్గొన్నారు.



PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com